ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

నవంబర్ 6, 2005

కథా నిలయం
శ్రీకాకుళం
Entered

సృష్టికి ప్రతిసృష్టి!

శృంగారమా... ప్రేమసుస్వరాగమా..?!

మనసా తెలుసా



హృతిక్...షాపులోనా?

క్యాంపస్ ఛాట్

రైబోఫ్లావిన్

ఆరోగ్యం

హ్యాపీ బర్త్‌డే

(6.11.2005 నుంచి
12.11.2005 వరకు)

సిహెచ్. మేఘన
1సం॥, 6.11.2004
గాయిత్రి-శ్రీనివాస్
యడవల్లి-నల్లగొండ

జి. అంజలి
1సం॥, 6.11.2004
సావిత్రి-నాగేష్
కుభీర్-ఆదిలాబాద్

ఆర్. శ్రీచందన
3సం॥, 7.11.2002
కవిత-శ్యామ్‌సుందర్
వారాసిగూడ-హైదరాబాద్

జె. సంపత్‌కుమార్
2సం॥, 7.11.2003
అనురాధ-రవిప్రసాద్
వెల్దండ-మ॥నగర్

ఇ. చరణ్‌రాజ్
9సం॥, 7.11.1996
మేరీస్టెల్లా-చంద్రశేఖర్
మల్కాజ్‌గిరి-హైదరాబాద్

చందన
6సం॥, 9.11.1999
కరుణశ్రీ-శేషు
ఆదిలాబాద్

బి. మహిమ
1సం॥, 9.11.2004
రాజకుమారి-ప్రసాద్
గుంటూరు

పి. కార్తీక్
1సం॥, 10.11.2004
అజంతా-శ్రీనివాస్
తుట్టగుంట-కృష్ణా

రుక్మిణీలహరి
2సం॥, 8.11.2003
రత్నకుమారి-చక్రపాణి
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

ఎన్. రోహిత్
1సం॥, 11.11.2004
ప్రసన్న-శివాజీ
ఒంగోలు-ప్రకాశం

సనతబస్సుమ్
1సం॥, నవంబర్-2004
రొకయ్యాబేగం-ఎ.కె. జిలానీ
అమరచింత-మ॥నగర్

పి. శ్రీవాణి
1సం॥, 11.11.2004
జ్యోతి-శేఖర్
పస్పుల-మ॥నగర్

పి. ఆర్తి
రాజి-శివ
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

బి. తిరుపతిరావు
7సం॥, 11.11.1998
నాగమల్లేశ్వరి-వెంకటేశ్వర్లు
ఏన్కూరు-ఖమ్మం

ఆహ్వానం

పదేళ్ల లోపు చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన తేదీకి 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. e mail ద్వారా కూడా ఫొటోలు పంపవచ్చు. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:
హ్యాపీ బర్త్‌డే, స్నేహ, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం,
1-1-298/4, స్ట్రీట్ నెం.1,
అశోక్ నగర్, హైదరాబాద్-20

e mail:
happybirthday_prajasakti@yahoo.com

ఈ వారం అతిథి

మన అతిథి గురించి...



పేరు	: మద్ది గోపాలకృష్ణారెడ్డి
వృత్తి	: రిటైర్డ్ వైస్‌ఛాన్సలర్ (ఆంధ్ర యూనివర్సిటీ)
ఊరు	: విశాఖపట్నం
విద్య	: ఎం.ఎ., ఎం.ఎ.(హానర్స్..), బి.ఎల్., పిహెచ్‌డి.డి.,
పుట్టిన తేదీ	: నవంబర్ 30, 1933
నచ్చిన వ్యక్తి	: జిడ్డు కృష్ణమూర్తి
నచ్చని అంశం	: పరులను వంచించడం
అలవాట్లు	: పుస్తక పఠనం, ఫిలాసఫీ

బాధ్యతాయుత జీవనముండాలి

జీవితం అంటేనే మార్పు. క్షణ క్షణం మారుతూనే ఉంటుంది. మార్పు లేనిదే అది జీవనం కాదు. నిర్జీవనం అవుతుంది. ఎప్పుడూ ఒకేలాంటి ఆలోచనలూ, ఆచరణలూ ఉంటే నాగరిక సమాజమే ఉండేది కాదు. నాగరికతలో మనం చూస్తున్న అనాగరికత, అమానుషత్వం, పశుత్వానికి మనుష్యుల ప్రవర్తనలో లోపాలే కారణమన్నది అందరికీ తెలుసు. ఈ పరిస్థితులకు మనకు సమాజంలో లభించే శిక్షణే కారణమన్నది గ్రహించాలి.

ఆశించినదానికన్నా లభించింది తక్కువైతే వేరెవరో బాధ్యులనుకోవడం, దూషించడం, దీనికి మూలం వ్యాపార దృష్టి సేవాదృష్టి లోపించడం. ఎంత తక్కువ పెట్టుబడితో ఎంత ఎక్కువ లాభం సంపాదిస్తామన్న ఆలోచన. ఈ వ్యాపార దృష్టి ఒక కేన్సరులాగ ఒక్క ధనార్జనలోనే కాకుండా అన్ని వ్యవహారాల్లో ప్రవేశించింది. అన్ని సంబంధ బాంధవ్యాలలో, స్నేహంలో, ప్రేమలో, దేవుని కొలవడంలో కూడా. కొలిస్తే లాభమొస్తుందన్న ఆశ. కొలవకుంటే నష్టమొస్తుందేమోనన్న భయం. ఈ శైలిలో దృఢ పడేది పరాధీన భావన. మన బతుకుకి మనదేమీ బాధ్యతలేదన్నది. ఈ తత్వం సవరిస్తే తప్ప వేరే మార్గమేమీలేదనిపిస్తుంది. సమాజ స్పృహ, దేశభక్తి ఇవన్నీ వ్యర్థ పదాలుగా మిగులుతాయి. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుజులోయ్' అన్నాడు మహాకవి గురజాడ. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో దేశమంటే ఒకానొక భౌగోళిక ప్రదేశమేమీకాదు, యావత్ప్రపంచం, మనుజులంటే ఒక్క మానవాళే కాదు. సకల చైతన్యజీవులు.

బాధ్యత తెలుసుకోవటానికి కావల్సింది భయాందోళనలు కాదు. తనలో తనకు నమ్మిక, ఇతరులలోనూ ఆ నమ్మిక ఉన్నదన్న నమ్మకం. ఇది బాధ్యతాయుత జీవనానికి నాంది, పునాది. ఆ పైన కర్తవ్య నిర్ణయంలోనూ, నిర్వహణలోనూ సేవాభావం, దానికి ఆధారమైన ప్రేమభావం. 'సొంత లాభం కొంత మానుకు, పరుల మేల్ తల పెట్టవోయ్', అనే భావం చొప్పించాలి. పోటీతత్వానికి ఇస్తున్న ప్రాముఖ్యత సహజీవనం, సహకారాలకు పెదవులు దాటి ఉండటంలేదు. పోటీతత్వం, సహకారం పరస్పర విరుద్ధాలు కావు. అసలు విషబీజం స్వార్థపరత్వంలో ఉంది. పోటీతత్వం ఉత్తమ స్థాయి పరిశ్రమను, భావాలను, నిపుణతలను గుర్తించడానికి వీలు కలిగిస్తుంది. వాటి ఫలితాలు సామూహిక శ్రేయస్సుకు అంకితం కావాలి. పాత విలువలు, కొత్త విలువులకు సమన్వయమే దీనికి దారి తీస్తుంది.

అందరూ ఒక పరిధిలో కొద్దో గొప్పో నేర్పేవాళ్లే-అందరూ గురువులే. అందరూ ఇంకొక పరిధిలో నేర్చుకొనేవాళ్లే-శిష్యులే. అందరిదీ ఈ బాధ్యత. నియమిత ఉపాధ్యాయుల బాధ్యత మరీ ఎక్కువ. విద్యాలయాలు సేవారంగాన్ని విడిచిపెట్టి వ్యాపారరంగంలో చేరిన తరువాత చేయటమనే సాధన కుంటుపడింది. నియమిత ఉపాధ్యాయులంటే పాఠశాలల్లోని వారే కాదు,. ఏ రంగంలోనైనా- రాజకీయరంగం, ఆర్థికరంగం, ప్రసారరంగం, విద్యారంగం, మత ప్రచారరంగం లాంటి ఏ రంగంలోనైనా- నాయకులందరూ నియమిత ఉపాధ్యాయులే. ప్రతి ఒక్కరూ గురువుగా బాధ్యతాయుతంగా శిష్యునిగా నమ్రత, శ్రద్ధలతో తెలియనిది తెలుసుకోవాలనే ఉత్సాహంతో ఉండాలి. 'తప్పులెన్నువారు తమ తప్పు లెరగరు' అన్నట్టు కాకుండా చేయాల్సిన బాధ్యత ఎవరిదో అన్నట్టు కాకుండా, ప్రతి ఒక్కరూ ఆత్మ పరీక్ష నిత్య జాగురూకతతో చేయవలసిందే. ఆత్మోద్ధరణ చేసుకోవలసిందే.

మద్ది గోపాలకృష్ణారెడ్డి

ఈ సంచికలో...

టపా ... 2

టర్నింగ్‌పాయింట్ 4

సలహాలు ... 5

ఇంటి సంగతులు ... 6

నేర్చుకుందాం..రా! 7

క్యాంపస్ ఛాట్ ... 10

సినిమా కబుర్లు ... 11

బాలనేస్తాలు 12

అట్టమీది కథ ... 14

మనమూ మన నమ్మకాలు 20

ఓ ఊరి కథ ... 21

సీరియల్ 18

మాధవి

ఇంకా...

మనసా తెలుసా 3

శృంగారమా... ప్రేమ సుస్వరాగమా ?!

కథ 18

పండగ పందిరి

ఆరోగ్యం ... 17

పప్పెట్ ఇంటర్వ్యూ ... 19

అవీ... ఇవీ 22

విజ్ఞానవీచిక ... 23

కొత్త పుస్తకాలు ... 24

సమయానుకూలంగా...

అట్టమీది కథ "రంజాన్ స్పెషల్ హలీం"ను సమయానుకూలంగా అందించారు. 'ఇంటిసంగతులు' శీర్షికలో 'అరవకండి అర్థం చేసుకోండిలా...!' ఉమ్మడి కుటుంబంలో ఉన్నవారికి ఆదర్శంగా ఉంది. 'క్యాంపస్ ఛాట్' శీర్షిక గత స్మృతులను జ్ఞాపకం తెచ్చే సన్నివేశాలతో చాలా బాగుంటోంది. ఇది విద్యార్థిలోకానికే ఒక హైలెట్.

చిప్పాడ ఉమామహేశ్వరరావు, కురుపాం, విజయనగరం



ఇలాగే కొనసాగించాలని...

'ఎవరు అనాథ?' కథ చాలా బాగుంది. అనాథలను గేలిచేయడం కన్నా... ప్రేమతో వారినక్కున చేర్చుకోవాలనీ, ఆదరించాలనీ ఈ కథ ద్వారా పాఠకులకు చక్కగా తెలియజేశారు. అలాగే 'మాధవి' సీరియల్ చాలా బాగా నడుస్తోంది. ఈ సీరియల్‌ను ఇలాగే కొనసాగించాలని మనవి.

బంగారు శేఖర్ బాబు, అచ్యుత్, కెడి పేట, విశాఖ

క్రమపద్ధతిగా..

ఈ వారం 'విజ్ఞాన వీచిక' శీర్షికలో 'అంతరిక్షంలో మరో అరుణపతాక' వర్ధమాన విజ్ఞానరంగ సమాచారంతో మమ్మల్ని ఆకట్టుకుంది. 'ఇంటి సంగతులు'లో కుటుంబంలోని వారంతా ఒకరినొకరు అర్థం చేసుకోవాలనీ, పరస్పరం గౌరవించుకోవాలనీ అందించిన విశేషాలందరూ అనుసరించదగ్గవే. కుటుంబంలోని వారు తమ పరస్పర సరదాలను, బలహీనతలను తేలిగ్గా తీసుకోవాలి. రాద్ధాంతం చేయకూడదు. 'యథా రాజా తథా ప్రజ' అన్నట్లు చిన్నవాళ్లు అన్ని విషయాలలోనూ పెద్దలననుకరిస్తారన్నది మరువకూడదు. అన్ని శీర్షికలకూ స్థానం కల్పించేలా... క్రమపద్ధతిగా స్నేహను రూపొందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

నేమాన సుభాష్ చంద్రబోస్,శ్రీకాకుళం టౌన్-1

గీటురాయి

ఇంటి సంగతులులో "అరవకండి...అర్థం చేసుకోండిలా...' నేటి కుటుంబ పరిస్థితులకద్దం పట్టే విధంగా ఉంది. కుటుంబంలోని వారంతా కలిసిమెలసి ఉండాలనీ, ఒకరినొకరు గౌరవించుకోవాలనీ, ఒకరి మనస్తత్వానికి మరొకరు సర్దుకుపోతూ సహజీవనం చేయాలనీ ఎంతో సున్నితంగా తెలియజేశారు. 'ఈ వారం అతిథి', 'టర్నింగ్ పాయింట్' శీర్షికలు స్నేహ సృజనాత్మకతకు పరిశీలన, పరిశోధన తత్వానికి గీటురాయి. ఇంతమంచి శీర్షికలందిస్తున్నందుకు ధన్యవాదాలతో.. **సిహెచ్ సీత, కొత్తగూడెం**

అభినందనలు

'స్నేహ'లో 'క్యాంపస్ ఛాట్' శీర్షికలో కాలేజీ విద్యార్థులు రాసిన అభిప్రాయాలు చదివాను. విద్యార్థులు తమ భావాలు పంచుకునేందుకు వీలుగా 'ఓపెన్ పేజీ' పెట్టి, ఇంత చక్కగా వారితో రాయిస్తున్నందుకు చాలా అభినందనలు. ఈ శీర్షికలో ఎంతోమంది విద్యార్థులు పాల్గొనాలనీ, అభిప్రాయలను తెలియజేయాలనీ ఆకాంక్షిస్తున్నాను.

దివ్య,కొత్తగూడెం

మనసా... తెలుసా?

శృంగారానికి "ప్రేమ" ఉండితీరాలా? అని ప్రశ్నించినప్పుడు.... "మీ పిచ్చిగానీ, సెక్సుకు, ప్రేమకు, సంబంధం ఏమిటీ...... ప్రేమలేకపోయినా సెక్సు చెయ్యెచ్చు" అంటున్నారు మగపిల్లలు. "ప్రేమ ఉండక పోతే కష్టం" అంటారు ఆడపిల్లలు. శృంగారమంటే కేవలం 'కలయిక' అని దృష్టిలో పెట్టుకుంటే మాత్రం.... ప్రేమ అవసరం లేదు.

శృంగారమా... ప్రేమ సుస్వరాగమా ?!

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,

ఫోన్ : 9849130141

ప్రేమ, శృంగారం ఈ రెండిటిపై మన సమాజంలో ఉన్న అభిప్రాయాలు చాలా జఠిలమైనవి. ఒకప్పుడు మన సమాజం 'పెళ్లికి ముందు సెక్సు సంబంధాలనొప్పుకునేది కాదు'. సెక్సు కోసం పెళ్లి చేసుకోవాలనే తలంపు రాక పూర్వమే పిల్లల పెళ్లిళ్లయిపోయేవి. టీనేజీ రావడంతోనే పిల్లలకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆలోచించేవారు. 'ఏ వయసులో ముచ్చట ఆ వయసులో' అనే భావన వీరిలో ఎక్కువగా ఉండేది. టీనేజీ రాగానే పిల్లల్లో ఏర్పడే శారీరక మార్పులను పెద్దవాళ్లు గుర్తెరిగి తగిన సంబంధం చూసి ముడిపెట్టే వారు. దాంతో పిల్లలకు తమ అవసరాలను తామే చూసుకోవల్సిన పరిస్థితుండేది కాదు. సహజీవనం కొనసాగించాల్సిన ఆవశ్యకత సామాజికంగా నిర్దేశించడం వల్ల పెళ్లి పట్ల అందరికి అవగాహన ఏర్పడేది.

ఇక ప్రేమ విషయానికొస్తే... అది పెళ్లి తర్వాతే. సహజీవన సమయంలో, ఒకరిపై మరొకరికి కలిగే అవగాహనద్వారా పాదుకోవల్సిన అంశంగానే ప్రేమను పరిగణించేవారు. అంచేత ప్రేమనేది ఇరుమనసుల కలయికగా విరాజిల్లేది. ఇక శృంగారమొక విజాతివ్యక్తి తోనే సాధ్యమనే ఆలోచన, అవగాహన, పరిపక్వత ఎక్కువమందిలో ఉండేది. కానీ ఇపుడు కాలం మారింది.

ఎప్పుడు కుదిరితే అప్పుడే పెళ్లి!

ఇదొకప్పటి మాట. ఇప్పుడలా కాదు. సామాజిక, జీవశాస్త్ర, విద్య, వైజ్ఞానిక, వృత్తి కారణాల రీత్యా పెళ్లికి వయోపరిమితిని నిర్ధారించారు. ఒకప్పుడు 16 ఏళ్లకే విద్యాభ్యాసం పూర్తయిపోయేది. గృహస్థు జీవితం మొదలయ్యేది. కానీ ఇపుడు 23 ఏళ్లు దాటితేగానీ పెళ్లి గురించి ఆలోచించే అవకాశం అటు తల్లి తండ్రులకు, ఇటు పిల్లలకు ఏర్పడడం లేదు. చదువు పూర్తయి ఉద్యోగం చూసుకునేసరికి 25 ఏళ్ళు వస్తున్నాయి. అప్పటి దాకా పెళ్లి ప్రసక్తి తలపెట్టే అవకాశం రాదు. అంత వరకు టీనేజీపిల్లల శారీరకావసరాలు సంతృప్తి చెందని నేపథ్యంలో వాళ్లు చాలా తేలిగ్గా శృంగార జీవితం పట్ల మొగ్గు చూపే పరిస్థితేర్పడుతోంది. అయితే తమ కాంక్షలను సామాజికామోదం కలిగి ఉన్న మార్గాలలో వ్యక్తపరిచే ప్రయత్నంలోనే ఈ ప్రేమ వ్యవహారాలు తెర మీదకొస్తున్నాయి.

పెళ్లికి ముందెలా ఉన్నా...

తాత్కాలిక ప్రేరణల ఫలితంగా టీనేజీపిల్లలు ముఖ్యంగా అబ్బాయిలు తరచుగా ప్రేమ వ్యవహారాలలో తలదూర్చి చదువుపాడు చేసుకుంటారు. అంతేకాక వివాహపూర్వ సెక్సు సంబంధాల నేర్పరుచుకుంటారు. కాలంతోబాటే ప్రజల అభిప్రాయాలలోనూ మార్పొచ్చింది. 'పెళ్లికి ముందు నువ్వెలా ఉన్నావో నాకనవసరం. పెళ్ళయిన తరువాత నుంచి సరిగ్గా ఉండాలి' అనే దృక్పథం నేటి యువతలో ఏర్పడు తోంది. వివాహ పూర్వ సెక్సు సంబంధాలను, సహించే పరిస్థితి వస్తోంది. అవి కేవలం సెక్సు సంబంధాలుగా మాత్రమే ఉండాలనీ, వాటిలో ప్రేమకు స్థానం లేకపోవడమే మంచిదనీ ఎక్కువమంది అభిలషిస్తు న్నారు. పెళ్లికి ముందు ఎంతోమంది అమ్మాయి లతో తిరిగాడనే అపవాదున్న వ్యక్తి విషయంలోనూ... "అదేమంత పట్టించు కొదగ్గ విషయం కాదనీ, ఎవరినయినా ప్రేమిస్తేనే తంటా" అనీ యువతరం భావిస్తోంది. పెళ్లికి ముందేర్పడే లైంగిక సంబంధాల కన్నా, ప్రేమ సంబంధాలే స్త్రీ పురుషులనెక్కువగా కలవరపరుస్తున్నాయి.

పెళ్లికి ముందు లైంగిక సంబంధాలకోసం ప్రాకులాడడం... దాన్నే ప్రేమగా భ్రమించడం... విజాతి వ్యక్తులతో సంబంధ బాంధవ్యాలను కొనసాగిం చడం వల్ల అకస్మాత్తుగా తారసపడే నిజమైన ప్రేమ అనుభవాలను అర్ధంచేసు కోలేని పరిస్థితేర్పడుతుంది. పెళ్లికి ముందు సాగించే ఇలాంటి "ప్రేమ" పెళ్లైన తరువాత

వివాహబంధానికో అడ్డంకిగా మారుతుంది. తాత్కాలికంగా సెక్సు సంబంధాలేర్పరు చుకునే వారి మధ్య ప్రేమ ఉండదనీ, సెక్సు ఒక్కటే వారిని కలిపే బంధమనీ అంటే ఇలాంటి వారికి కోపం రావొచ్చు. కానీ, ఏ సంబంధం లేని వాళ్లు సైతం సెక్సులో గాఢంగా దగ్గరయిపోవచ్చు. సెక్సుపరంగా గాఢంగా అల్లుకుపోయిన ఇద్దరు స్త్రీపురుషులు క్రమంగా ఒకరినొకరు ప్రేమించుకోవచ్చు. దీనికి పూర్తిగా విరుద్ధమైన పంథాలో... ప్రేమబంధం గాఢంగా అల్లుకున్న వ్యక్తులు సెక్సుని ప్రాముఖ్యతలేని అంశంగానూ పరిగణించొచ్చు. కొంతమంది కుర్రకారులో మాత్రం పరస్పర వ్యక్తిత్వాల అవగాహన, ఒద్దిక చాలా ముఖ్యమైనవి అని అన్పించొచ్చు. ఈ భావన క్రమేపి, ప్రేమనభివృద్ధి పరిచేందుకు కీలకపాత్ర వహించొచ్చు. ఇలా అని ఖచ్చితంగా చెప్పలేం. అందుచేతనే...ప్రేమకోసమే ఇట్లాంటి సెక్సు సంబంధాలలో పాల్గొనే వ్యక్తులు, ప్రేమ లభించక, నిరాశపడతారు. దెబ్బతిన్నట్లు భావిస్తారు. తాత్కాలిక సెక్సులోని సుఖానికి మాత్రమే విలువిచ్చే వారికిది సులభంగానే ఉంటుంది. ఇంతకన్నా ఎక్కువగా ఎదురు చూసే వారికి మరి నిరాశే గతి!. అందులోనూ నేటి విశృంఖల సంస్కృతి చాలా ప్రమాదకర స్థాయిలో ఉంది. అందుకే ఈ విషయంలో యువత తమంతటతాముగా చాలా జాగ్రత్తలు పాటించక తప్పదు. "అలా వద్దు" " ఇలా తగదు" అని చెప్పే తల్లిదండ్రులు ప్రతీక్షణం మీ వెన్నంటి ఉండరు. అందుకే మీకు మీరే కాపలా. ✪

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

హేమును గాయపర్చి, శక్తి హీనుణ్ని చేసిన బాణం భారతదేశ చరిత్రనే మార్చివేసింది. తిరిగి అక్బర్ మొఘలాయి సింహాసనాన్ని అధిష్టించాడు మత సామరస్యానికి, ఉదారత్వానికి, ప్రజా శ్రేయస్సుకు మారు పేరుగా నిలిచాడు జాతీయ చక్రవర్తిగా ఖ్యాతినార్జించాడు.

మొఘలాయీ సామ్రాజ్యాన్ని కాపాడిన శరాఘాతం

హుమాయూన్

ఏ దేశ చరిత్ర చూసినా, ఏమున్నది గర్వకారణం... రణరంగం కానిచోటు భూ స్థలమంతా వెదికిన దొరకదు. అని మహాకవి శ్రీశ్రీ తన 'దేశ చరిత్రలు' అనే ప్రసిద్ధ గేయంలో చెప్పాడు. మానవాళి పుట్టినప్పటి నుండి యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. భూ ఆక్రమణల కోసం, ధనం కోసం, తమ అహంకారాన్ని, బలాబలాల్ని ప్రదర్శించడం కోసం, ఆధిపత్యం కోసం మారణ హోమాలు సంభవిస్తూనే వున్నాయి. భారత దేశంలో, ఒకే ప్రదేశంలో దేశ చరిత్రను ముఖ్యమైన మలుపు తిప్పిన మూడు యుద్ధాలు జరగడం అరుదైన, ఆశ్చర్యకర విషయం. వీటికే పానిపట్టు యుద్ధాలని పేరు. నేడు హర్యానాగా పిలవబడుతున్న రాష్ట్రంలో ఢిల్లీకి అవలి దూరంలో ఒక విశాలమైన మైదానం ఉంది. దానిపేరే పానిపట్టు. అక్కడ 1526లో జరిగిన మొదటి పానిపట్టు యుద్ధంలో ఢిల్లీ సుల్తానుల రాజ్యాన్ని అంతమొందించి, మంగోల్ జాతికి చెందిన బాబర్ చారిత్రాత్మక మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. అక్కడే 1556లో జరిగిన మరో యుద్ధంలో, అక్బర్ మొఘల్ సామ్రాజ్యాన్ని కాపాడుటకు 1771లో జరిగిన మూడవ పానిపట్టు యుద్ధంలో మహారాష్ట్రుల బలీయ శక్తిని ఆఫ్ఘన్ దండయాత్రలో నాదిర్షా ప్రభృతులు అంతమొందించి ఆంగ్లేయాధికార స్థాపనకు పరోక్షంగా తోడ్పడ్డారు.



1526లో మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించిన బాబర్ మరణానంతరం అతడి కుమారుడు హుమాయూన్ రాజ్యానికొచ్చాడు. ఇతడు వ్యక్తిగతంగా మంచివాడే! కానీ బలహీనుడు. యుద్ధ విద్యలో ఆరితేరినవాడు కాదు. అదృష్టహీనుడుగా చరిత్రకారులచే అభివర్ణింపబడ్డాడు. తండ్రికి తగ్గ తనయుడు కాదు. మొదటి పానిపట్టు యుద్ధంలో బాబర్, ఆఫ్ఘన్లను ఓడించినా వారి శక్తి సామర్థ్యాలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోలేదు. రాజ్యాన్ని స్థిరీకరించి కట్టుదిట్టం చేయకముందే బాబర్ మరణించాడు. అప్పుడు అదను చూసుకొని షేర్ ఖాన్ సూర్ (షేర్షా) చెల్లాచెదురైన ఆఫ్ఘన్ సైన్యాలను మళ్లీ సమీకరించాడు. బెంగాల్, కనౌజ్, బూనార్, మాళవ, గుజరాత్, బీహార్ మొదలగు ముఖ్య రాజ్యాలన్నింటినీ ఆక్రమించాడు. ఆ ఆక్రమణలు కొనసాగుతున్నప్పుడు హుమాయూన్, షేర్షాను నిలువరించలేకపోయాడు. అంతఃపురం విలాసాలలో మునిగితేలాడు. ముంచుకొస్తున్న ముప్పును ఆకళింపు చేసుకోవడంలో విఫలుడయ్యాడు. తుదకు 1540లో షేర్షా చేతిలో హుమాయూన్ పూర్తి ఓటమికి గురై, కన్నులొట్టబోయి, బ్రతుకు జీవుడాయని ఢిల్లీ వదలి పారి పోయాడు. మొఘల్ సామ్రాజ్యం పతనమైంది. దాదాపు 15 సంవత్సరాలు (1540 నుండి 1555) దాకా హుమాయూన్ దిక్కూ దివాణం లేకుండా దేశ దిమ్మరిగా తిరిగాడు. ఈ కాలంలోనే 1542లో భావి మొఘలాయి చక్రవర్తి అక్బర్ జన్మించాడు. మొదటి పానిపట్టు యుద్ధంలో అంతమైన ఆఫ్ఘన్ల రాజకీయాధికారం షేర్షా నాయకత్వంలో పునఃప్రతిష్ఠాపితమైంది. షేర్షా సమర్థుడు, చక్కని పరిపాలనాదక్షుడు. నిశిత మేధావి. కానీ షేర్షా మరణానంతరం అతడి వారసులు అధికారం కోసం జరిపిన పెనుగులాటలో బలహీనపడ్డారు. తుదకు మహమ్మద్ ఆదిల్ షా అధికారానికొచ్చినా పెత్తనమంతా. సమర్థుడైన మంత్రిగా వున్న హేమూదే ఇది గిట్టని కొందరు ఆస్థాన ప్రభువులు హేముకి వ్యతిరేకంగా కుట్రలు పన్నడం ఆరంభించారు. సరైన సమయం కోసం వేచి చూస్తున్న హుమాయూన్, సైన్యాన్ని కూడగట్టుకొని, సూర్ రాజవంశస్థుల అంతఃకలహాలను ఆధారం చేసుకొని, తన పూర్వపు రాజ్యాల్ని చాలా వరకు ఆక్రమించాడు. కానీ, పూర్తిగా మొఘల్ సామ్రాజ్యాన్ని పునస్థాపితం చేసేలోగానే, అంతఃపురంలోని, గ్రంథాలయం నుండి మెట్లు దిగుతూ, జారిపడి చనిపోయాడు. హుమాయూన్ చనిపోయేనాటికి అక్బర్‌కు 13 ఏండ్లు, లోకమెరుగని పసివాడు. కానీ, అక్బర్‌కొక శక్తివంతుడైన, సమర్థుడైన సంరక్షకుడున్నాడు. అతడి పేరు బైరాంఖాన్. ఢిల్లీకి దూరంగా అడవుల్లో, కొండల్లో తిరగాడుతున్న, అక్బరు మొఘల్ చక్రవర్తిగా బైరాంఖాన్ ప్రకటించి, రాజ్యాధికార స్వీకరణ లాంఛనాలు జరిపించాడు.

అక్బర్‌చక్రవర్తి

బైరాంఖాన్ సాయంతో అక్బర్ రాజ్యాధికారానికొచ్చినా, చక్రవర్తిగా పూర్తి అధికారాలు చెలాయించే పరిస్థితి కాదు, ఇక ఆ దశలో, జరిగిన రెండవ పానిపట్టు యుద్ధం నిర్ణయాత్మకంగా, భారతదేశ చరిత్రను పూర్తిగా మార్చివేసింది. పిన్న వయస్కుడైన అక్బర్‌పై, ఆదిల్‌షా అతని ముఖ్యమంత్రి హేము నాయకత్వంలో, భారీ సైన్యంతో, 1500 గజబలంతో దండెత్తాడు. పానిపట్టు వద్ద ఇరు సైన్యాలు మోహరించాయి. అక్బర్‌కు ఇదొక పెను సవాలు. మొఘలాయి వంశం రాజ్యమేలాలా లేదా అన్నది ప్రధాన సమస్య. యుద్ధం ఆరంభమైంది. వీరోచితంగా పోరాడుతూ, శత్రు సైన్యాలను ఛేదించుకొంటూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్న సమయంలో యుద్ధభూమిలో ఏనుగుపై వుండి వీర విహారం చేస్తున్న హేము కంట్లోకి ఒక పదునైన బాణం దూసుకొచ్చి, అతడిని తీవ్రంగా గాయపర్చింది. దీంతో హేము స్పృహతప్పి పడిపోయాడు. దాంతో హేము సైన్యం చెల్లాచెదురైంది. ఎటువాళ్లు అటు పారిపోయారు. హేము మరణంతో, అక్బర్‌ని విజయలక్ష్మి వరించింది. హేమును గాయపర్చి, శక్తి హీనుణ్ని చేసిన బాణం భారతదేశ చరిత్రనే మార్చివేసింది. తిరిగి అక్బర్ మొఘలాయి సింహాసనాన్ని అధిష్టించి, మత సామరస్యానికి, ఉదారత్వానికి, ప్రజా శ్రేయస్సుకు మారు పేరుగా నిలిచి. జాతీయ చక్రవర్తిగా ఖ్యాతినార్జించాడు.

ప్రోనోటుతో దావా

నేను రైల్వే ఉద్యోగిని. నా ప్లాటు కాగితాలు కుదువపెట్టి నా సహోద్యోగికి 40వేల రూపాయలిప్పించాను. సంవత్సరంలోగా బ్యాంకునుండి కాగితాలు విడిపిస్తానని అతనన్నాడు. రెండు సంవత్సరాలయినా విడిపించలేదు. నేను ఇల్లు కట్టుకుందామంటే అతను ఇల్లు కట్టనీయలేదు. నేను డబ్బులిచ్చే ముందు అతనితోనూ, అతని భార్యతోనూ ప్రామిసరీనోటు రాయించుకున్నాను. వేరే ఉద్యోగి మధ్యవర్తిగా ఉన్నారు. అసలూ వడ్డీ కలిపి 50 వేలయింది. దావా వేయొచ్చా. తెలుపగలరు.

వెంకటేశ్, హైదరాబాద్



సామరస్య పూర్వకంగా...

మాకు రెండెకరాల మెరక పొలముంది. దాదాపు ఐదు సంవత్సరాల క్రితం మండల సర్వేయర్‌తో సర్వే చేయిచాం. దాదాపు 0.11 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని తెలిసింది. మేం సర్వేచేయించిన తరువాతే ఈ విషయం ఇటు మాకు, అటు ఆక్రమణదారులకు తెలిసింది. ఆక్రమణ దారులు మా స్థలంలో ఇళ్లుకట్టుకుని దాదాపు 25 సంవత్సరాలు దాటింది. ఈ విషయం పెద్దల ద్వారా కాని, రెవెన్యూ అధికారుల ద్వారా కాని పరిష్కారం కాలేదు. మేం ఏ కోర్టుకూ వెళ్లలేదు. లోక్ అదాలత్ ద్వారా ఆక్రమణదారులూ, మేమూ కలసి సామరస్య పూర్వకంగా ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడం కుదురుతుందా ? లోక్ అదాలత్ అనేది కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు మాత్రమే వర్తిస్తుందా ? లేక ఒక పిటీషన్ రాసి లోక్ అదాలత్‌కు సమర్పిస్తే ఈ సమస్యను పరిష్కరిస్తారా? తగిన వివరాలివ్వగలరని కోరుతున్నాం.

శ్రీనివాస్, నెల్లూరు.

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

మీరు డబ్బులిచ్చిన వ్యక్తి మీ సహోద్యోగి అంటున్నారు. ప్రత్యక్షంగా అతన్నడిగి చూడండి. అప్పటికీ ఇవ్వకపోతే లాయరును కలవండి. లీగల్ నోటీసిప్పించి సికింద్రాబాదు కోర్టులో దావా వేయాల్సి ఉంటుంది. ప్రోనోటు ఉంది కాబట్టి వడ్డీ సహా మీ డబ్బును మీరు తిరిగి పొందొచ్చు.

మీరు పిటీషను రాసి లోక్ ఆదాలత్ కార్యాలయానికి పంపించండి. వారు స్పందించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తారు. మీరిరువురూ ఒక అంగీకారానికొచ్చేట్లు చేస్తారు. అలాకానట్లయితే కోర్టు కెళ్లమని చెబుతారు. ఇరు పక్షాలు ఒక అంగీకారానికొస్తేనే లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరిస్తారు. లేదంటే కోర్టుకెళ్లాల్సిందే. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకైనా ఇదే వర్తిస్తుంది.

గొర్రెదాటు లెక్క

పిల్లలూ మీకు ఒక చిన్న లెక్క చెబుతానర్రా సమాధానాలు చెప్పాలి అన్నాడు టీచర్ సరే అన్నారు ఎలిమెంటరీ స్కూలు పిల్లలు.

"నా దగ్గర పన్నెండు గొర్రెలున్నాయి. వాటిలో ఆరు కాలువ దూకి అవతలవైపు వెళ్లాయి. ఇవతల ఇంకా ఎన్ని ఉంటాయి ?"

ఎవరూ సమాధానం చెప్పలేదు.

" ఏరా కూడికలు తీసివేతలు మీకు ఎన్ని సార్లు చెప్పాను . ఇంత చిన్న లెక్కకు ఎవరూ సమాధానం చెప్పలేరా" అన్నాడు టీచర్. "లేదు సార్ మీ గొర్రెల గురించి మీకు తెలియదు. ఒక్కటి కూడా మిగల్లేదు అన్నీ ఒకదాని వెంట ఒకటి వెళ్లి పోయాయి " అన్నారు పిల్లలు.

- ఎం.కె.ఆర్

ఇంటి సంగతులు

అప్పుడే అమ్మాయికి పెళ్లా...?

కె. నిర్మల

"ఈ విషయం విన్నావా జానకీ?" అంటూ జానకి వాళ్లింట్లోకి ఆదరాబాదరాగా ప్రవేశించింది రమణి.

"ముందు తాపీగా కూర్చో. ఆ తర్వాత చెబుదువుగానీ" అంటూ రమణికి మంచి నీళ్లందించింది జానకి.

మంచి నీళ్లు గటగటా తాగేసిన తర్వాత "నీలిమకు పెళ్లి చేయాలనుకున్నారట తెలుసా?" అంది రమణి.

"అదేమిటి... నీలిమకు అప్పుడే పెళ్లా? అయినా ఇంత చిన్న వయసులో పెళ్లి చేయడమేమిటి నాన్‌సెన్స్"

"సెన్స్‌లేదనే చిన్నపిల్లకు పెళ్లి చేయాలనుకుంటున్నారు జానకీ..." అన్నది రమణి.

ఇంతకూ నీలిమ వయసెంతనుకున్నారు? పదిహేను సంవత్సరాలు! మొన్ననే పదోతరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

"ఇంత చిన్న వయసులో పెళ్లి చేయటమన్నది చట్టరీత్యా నేరం. చిన్న వయసులో గర్భం ధరిస్తే, ప్రసవ సమయంలో ఎన్నో ఇబ్బందులు కలగొచ్చు" అన్నది జానకి.

"ఔను జానకీ నువ్వు చెప్పేది అక్షరాలా నిజం. వారికి గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన ఆహారం, పాటించవలసిన జాగ్రత్తల గురించి సరైన అవగాహనుండదు. ఫలితంగా గర్భస్రావం, అకాల ప్రసవం, తక్కువ బరువుగల శిశువు పుట్టడం, గర్భంలోనే చనిపోవడం లాంటివి సంభవించొచ్చు. నీలిమను కాలేజీలో చేర్పించి చదివించాల్సింది. ఇంత చిన్న వయసులో పెళ్లి చేయడం అన్యాయం కదా?" సాలోచనగా అన్నది రమణి.

"అంతే కాదు రమణీ... ఆ అమ్మాయి సంబంధం పరాయిది కాదు. మేనరికంట"

"చిన్నపిల్లకు పెళ్లి చేయడమే పొరబాటు. పైగా మేనరికమా?!"

అమ్మాయికి పెళ్లి చేసేటప్పుడు తల్లిదండ్రులామె వయస్సును దృష్టిలో పెట్టుకోవాలి. అమ్మాయి మనసుకి, అభిప్రాయాలకు ప్రాధాన్యత నివ్వాలి. పెళ్లిచేస్తే బాధ్యత తీరిపోతుందనుకోకూడదు. చదువు పట్ల ఆసక్తి కనబరుస్తుంటే చదువుకోనివ్వాలి. దీని వల్లే యువతికి మానసిక ఎదుగుదల, వికాసం, పరిణితి ఏర్పడతాయి. పిల్లలను పెంచడం పట్ల ఒక అవగాహన ఉంటుంది. తన ఆరోగ్యాన్నీ కాపాడుకోగలుగుతుంది. అందుకే అమ్మాయికి 20 సంవత్సరాల తర్వాత పెళ్లి చేస్తేనే మంచిది. అదే సరైన వయస్సు.



ఆడపిల్లను గుండెల మీద కుంపటిలా భావించే రోజులు పోయాయి. అమ్మాయిలు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ ప్రవేశిస్తున్నారు. తమ కాళ్ల మీద తాము నిలబడుతున్నారు. కుటుంబానికీ ఆసరా అవుతున్నారు.

జానకి, రమణి మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. ఒక నిర్ణయానికొచ్చినట్లుగా వారిరువురూ లేచి నిలబడ్డారు. చేతులు కలిపారు. చదువులో ఆసక్తి కనబరుస్తున్న అమ్మాయి పట్ల ఇలా ప్రవర్తించడం భావ్యంకాదని నీలిమ తల్లిదండ్రులకు సలహా ఇవ్వడానికి వాళ్లింటి వేపు అడుగులేశారు.

ఆడపిల్లల తల్లిదండ్రులు 'అమ్మాయి బరువెప్పుడు దించుకుందామా' అన్న ఆలోచనలకు గుడ్‌బై చెప్పాలి. ప్రగతి పథంలో ముందుకు సాగడానికి తగిన ప్రోత్సాహమందించాలి. ✪

నేర్చుకుందాం...రా!

ఫాబ్రిక్ పెయింటింగ్‌కు రంగులు

సండే డెస్క్

"ఎక్స్‌క్యూజ్‌మీ...మామ్...ఒన్ మినిట్ ప్లీజ్"

"ప్చ్... అసలే ఆఫీసుకు లేటైందని టెన్షన్ పడుతుంటే... ఇప్పుడెవర్రా బాబు నన్ను పిలుస్తున్నారు"అనుకుంటూ వెనక్కి తిరిగి చూసింది అనూరాధ

"హాయ్ మామ్... నా పేరు శిల్ప. ఫ్యాషన్ టెక్నాలజీ చేస్తున్నాను. మీ డ్రెస్‌పై వర్క్ చాలా బాగుంది. బస్సెక్కుతున్నప్పుడే మిమ్మల్ని చూశాను. చాలా రష్‌గా ఉంది కదా... మాట్లాడ్డానికే కుదర్లేదు. మీరు నా కన్నా ముందే దిగిపోతారేమోనని చాలా కంగారు పడ్డాను. లక్కీగా నేను దిగాల్సిన స్టేజీలోనే మీరు దిగారు. బై ది బై... ఈ వర్క్ ఏ డిజైనర్‌తో చేయించారు మామ్" ఆపకుండా మాట్లాడేస్తూనే ఉందా అమ్మాయి.

"డిజైనరా... నేనే వేశాను" అని చెప్తున్న అను ముఖంలో ఒకింత గర్వం తొణికిసలాడింది.

మీ దుస్తులూ ఇలా నలుగురినీ ఆకర్షించాలని మీకనిపిస్తోంది కదూ...ఐతే ఆలస్యం దేనికి చదవండి మరి.

వివిధ రంగుల వస్తువులు ఉన్నాయనుకోండి. వాటిలో మీరు మొదట దేన్నెంపికచేసుకుంటారు? ఆ వస్తువునే ఎంచుకోవడానికి కారణమేంటి? రంగు. నిస్సందేహంగా. ఎందుకంటే... ఆకర్షణీయమైన రంగు ఆ వస్తువుకు లేకపోతే మీరా వస్తువును తీసుకుంటారా? రంగుకు గల ప్రాముఖ్యత అదే మరి. ఇక బట్టల విషయానికొస్తే... 'రంగు'కున్న విలువ చెప్పనవసరం లేదు. మనం వేసుకునే బట్టల రంగు చూపరులను ఇట్టే ఆకర్షించాలనే మనమాశిస్తాం. అందరి దృష్టీ అలాంటి దుస్తులు ధరించిన వ్యక్తి మీదే నిలుస్తుంది. ఆ కలర్‌ఫుల్ దుస్తులకు ఎంబ్రాయిడరీ తోడైందనుకోండి... ఇక చెప్పక్కర్లేదు. ఈ రంగుల విషయంలో కాంబినేషన్స్ ముఖ్య పాత్ర పోషిస్తాయి.



కొన్ని కాంబినేషన్స్ ఆకర్షణీయంగా ఉంటే... మరికొన్ని అసహ్యంగా ఉంటాయి. అందుకే బట్టల మీద ఎంబ్రాయిడరీ చేసుకునేప్పుడు రంగుల కాంబినేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. రంగుల కాంబినేషన్‌తో బట్టలమీద పేయింటింగ్ చేయాలనుకుంటున్నారా? ఐతే మీరివి తెలుసుకోవాల్సిందే...

రంగులెన్ని రకాలుగా విభజించొచ్చు? దీనికి సమాధానం సప్త వర్ణాలుగా అనే కదూ. కానీ మనకున్న ప్రాథమిక రంగులు మూడే... అవి 1. ఎరుపు, 2. పసుపు 3. నీలి రంగు. వీటినే ప్రాథమిక రంగులంటారు. ఈ మూడింటినీ కలిపితే ఇతర రంగులను తయారు చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎరుపు, పసుపు కలిపినట్లైతే నారింజ రంగొస్తుంది. పసుపు నీలిరంగు కలిపితే ఆకుపచ్చరంగు, ఎరుపు నీలిరంగు కలిపితే ఊదారంగు వస్తాయి. ఇలా ప్రాథమిక రంగుల వల్ల ఏర్పడే రంగులనే 'సెకండరీ కలర్స్' (మాధ్యమిక రంగులు) అంటారు.

మీకు మరిన్ని రంగులు తయారు చేయాలనిపిస్తోందా? ఐతే ఈ ప్రాథమిక, మాధ్యమిక రంగులను సమపాళ్లలో కలపండి. ఫలితంగా మీరు మరికొన్ని రంగులను సృష్టించుకోవచ్చు. వీటినే "మిశ్రమ రంగులు" అంటారు. ఎరుపు, నారింజ కలిపినట్లయితే ఎర్రటి నారింజ రంగు, నారింజ, పసుపులను మిశ్రమం చేసినట్లయితే పసుపునారింజ రంగు వస్తాయి. ఈ రంగులలో కొన్ని పరస్పరం కలిసిపోయేవిగా ఉంటాయి. వీటినే "కాంప్లిమెంటరీ కలర్స్" అంటారు. ఆలోచిస్తున్నారేంటి? ఇవెలా ఉంటాయనేనా? ఏముంది పసుపు రంగు పక్కనే నారింజ రంగునూ, ఎరుపు రంగు పక్కనే ఉదారంగునూ ఉంచండి. ఎలా కనిపిస్తున్నాయి? దాదాపు ఒకేలా కదూ. వీటినే కాంప్లిమెంటరీ కలర్సంటారు. ఇప్పుడు తెలుపు నలుపు, ఎరుపు ఆకుపచ్చ, పసుపు ఉదారంగులను పక్కపక్కనే ఉంచి చూడండి. ఇవన్నీ వేటికవే కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. ఇలా ఒక రంగుకు మరో రంగు వ్యతిరేకంగా కనిపించేవాటిని 'కాంట్రాస్ట్ కలర్స్' అంటారు. ✪

నెమ్మదిగా పొమ్ము

ఏరా లేటుగా వచ్చావ్ ఎందుకు ?

రోడ్డుమీద ఒక బోర్డు చూశాను అందుకు సార్

ఏం బోర్డేమిటి?

స్కూలు ఉన్నది నెమ్మదిగా పొమ్ము.

-ఎం.కె.ఆర్

సీరియల్

గత వారం కథలో...

తనకు చక్రవర్తి కాగల కుమారుడిని మాధవి కనిస్తుందని దివోదాసు ఆశలపెట్టుకుని ఉన్నాడు. అందుకోసం గాలవుడడిగిన గుర్రాలుకూడా ఇచ్చాడు. ఆ రాజాస్థానంలో మాధవిలాగే మేఖల లాంటి పారిచారికలు కూడా కొనగా వచ్చినవారే. దివోదాసు నియంతృత్వ రాజ్యంలో మాధవి చచ్చిన శవంలా రాజుతో కాపురం చేస్తోంది.

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

(18వ భాగం)

మాధవికి ఆ నెల కూడా నెలసరి రాకపోవడంతో గర్భం దాల్చినట్లు స్పష్టమైంది. ఇక దివోదాసు ఆనందానికి అవధుల్లేకపోయాయి. మాధవిని ఎత్తుకుని గిరగిరా తిప్పాడు. ఆమెకి రవ్వంత సంతోషం కలగకపోగా దుఃఖం ముంచుకొచ్చింది. 'ఇది భార్యభర్తల బంధంకాదు, తమమధ్య మమతానురాగాలేం లేవు. అతడికాక్కవలసిందల్లా స్త్రీ సుఖం. పుట్టే బిడ్డను అప్పగించి పుట్టెడు శోకంతో ఇక్కణ్ణించి వెళ్ళాలి. ఏం బతుకిది?

కుక్క కూడా తన పిల్లలను తానే సాకుతుంది, ఇంకొకరు కన్నెత్తి చూస్తే కరుస్తుంది. కానీ తాను మట్టుకు సృష్టివిరుద్ధంగా బిడ్డనొదిలేసి వెళ్లిపోవాలి. ఇంతకంటే తనకు పాపాయి పుట్టకపోయినా బాగుండును' అనుకుని ఆక్రోశించింది.

"సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నా సత్యవతి కడుపు పండలేదు. నువ్వింత త్వరగా గర్భం దాల్చావంటే కలా, నిజమా అన్పిస్తోంది మాధవీ" అన్నాడు దివోదాసు.

బదులివ్వని మాధవిని చూసి "అదేంటి, అంత ముభావంగా వున్నావు, నీకు సంతోషంగా లేదా?" అన్నాడు మళ్లీ.

'కేవలం ఒక పనిముట్టులా వాడుకుంటున్న నీకు నా బాధేం అర్థమౌతుందిలే' అనుకుని ఊరుకుంది.

దివోదాసు ఆమెని గట్టిగా కౌగిలించుకుని "గాలవుడు నిన్ను నావద్దకు చేర్చడం నిజంగా వరం ప్రసాదించినట్లే వుంది. నీకేదైనా మంచి బహుమతి ఇవ్వాలనుంది మాధవీ, నీకేం ఇష్టమో చెప్పు, ఎంత ఖరీదైనా పరవాలేదు" అన్నాడు.

'నన్నీ చెరనుంచి విడిపిస్తే చాలు, అంతకంటే గొప్ప బహుమతి ఇంకేం ఉండదు. అప్పుడు నాకు పుట్టే బిడ్డను పెంచుకుంటూ కాలక్షేపం చేస్తాను' అనుకున్న మాధవి ఆ మాటలు పైకి చెప్పే ధైర్యంలేక మిన్నకుండిపోయింది.

బిగుసుకుపోయి నిలబడ్డ మాధవిని బాహుబంధంనుండి విడిచిపెట్టి "నీకు బహుశా ఒంట్లో బాగున్నట్లు లేదు, విశ్రాంతి తీసుకో. రాజవైద్యుణ్ని కనిపెట్టుకుని వుండమని హెచ్చరిస్తాను, జాగ్రత్త మాధవీ.. నువ్వు దేన్నీ అశ్రద్ధ చేయకు, ఏమాత్రం తేడాగా వున్నా అతన్ని పిలిపించుకుని మందులు వాడు" అన్నాడు ఆమె భుజాలు పట్టుకుని కూర్చోబెడుతూ.

✿ ✿ ✿ ✿

ఆవేళ చెలికత్తెలద్వారా వార్త తెలిసిన సత్యవతి పూలు, పండ్లు, పట్టుబట్టలను వెండి, బంగారుపళ్ళాల్లో మోయించుకురావడం చూసి మాధవి ఆశ్చర్యపోయింది.

"విషయం తెలిసి చాలా సంతోషం కలిగింది మాధవీ, ఇవి కాదనకుండా తీసుకో" అంది.

మాధవి కళ్ళు చెమర్చాయి. సత్యవతి మంచితనాన్ని గురించి మేఖల చాలా చెప్పివుండటాన ఆవిడపట్ల తెలీకుండానే అభిమానం కలిగింది. ఇపుడు గర్భం దాల్చినట్లు తెలిసి ఈర్ష్యపడకపోగా ప్రేమగా తాంబూలం తీసుకురావడంతో మరింత ఆత్మీయత కలిగి అవ్వ గుర్తొచ్చింది.

'ఈ అభాగ్యురాలిమీద కాస్తంత ప్రేమ కలిగినందుకు సంతోషం. కూర్చో అక్కయ్యా" అంటూ ప్రేమగా చేతులు అందుకుని కూర్చోబెట్టింది మాధవి.

"వాళ్ళూవీళ్ళూ చెప్పగా విని ఏమో అనుకున్నాను,

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

నిజంగా అప్సరసలా వున్నావు మాధవీ.. యాగం సమయంలో నిన్నంతగా పరికించి చూడలేదు" అంది సత్యవతి.

'అలా లేకుండా కురూపిలా వున్నా బాగుండేది, తన తండ్రి దానమిచ్చిననాడే గాలవుడు అక్కర్లేదనేవాడేమో. ఒకవేళ గ్రహించినా ప్రతిరాజూ తిరస్కరించేవాడు. అప్పుడింత కడుపుకోత వుండేదికాదు' అనుకుంది మాధవి.

మెచ్చుకునేసరికి సిగ్గుతో మాట్లాడలేదేమోనని సరిపెట్టుకుని "చాలా నీరసంగా వున్నావు, బాగా తిను. ఇలాంటప్పుడు ఏవేవో కోరికలు కలుగుతాయని విన్నాను, నీకేం తినాలనిపించినా మొహమాటపడకుండా వంటావిడకు చెప్పి చేయించుకుని తిను మాధవీ" అంది సత్యవతి.

"నాకేమీ అక్కర్లేదు, దేనిమీదా కోరికలేదు"

"ఉహూ, అలా నిరాసక్తంగా వుంటే బాగాలేదు. ఇలాంటప్పుడు సంతోషంగా వుండాలి. అది కడుపులో బిడ్డక్కూడా మంచిది, ఏమంటావు?!"

సత్యవతి మరికాసేపు అవీఇవీ మాట్లాడి వెళ్ళిపోయినప్పటికీ మాధవి విచారవదనాన్ని మర్చిపోలేకపోయింది. 'కడుపుతో వున్నవాళ్ళు సుఖంగా, సంతోషంగా వుండాలంటారు.. కానీ తను ఎందుకో బాధగా వుంది. ఏ కోరికలూ లేవని చెపుతున్నపుడు ముఖంలో దిగులు స్పష్టంగా కనిపించింది. ఎందుకబ్బా? నిజానికి గర్భం ధరించడమంటే సామాన్య విషయమా? తనకే అలా జరిగితే ఆనందం అంబరం తాకేది. ఏదేమైనా మాధవిని సంతోషపెట్టాలి, ఎలా...' అని తీవ్రంగా ఆలోచించిన ఆవిడ మనసులో వనవిహారపు ఆలోచన మెదలడంతో ఆ మాట రాజుకు చెప్పింది. దివోదాసు వెంటనే అందుకు తగిన ఏర్పాట్లు చేయించాడు.

రాణీవాసపు స్త్రీలందరూ తమ దాసీలు, చెలికత్తెలతో సహా బయల్దేరారు. ముందూవెనుకా రాజభటులతో సురక్షితంగా ప్రయాణం చేసి ఒక చక్కటి ప్రదేశం చేరుకున్నారు. ఒక పెద్ద మర్రిచెట్టు నీడన తివాచీ పరచి పానీయాలు, తినుబండారాలు అమర్చి కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

మాధవి గాలవుడితో కలసి ప్రయాణం చేసినపుడు అడవి నిర్మానుష్యంగా వుంది. ఇపుడు ఇందరితో కలిసి వెళ్తోంటే గొప్ప సందడిగా వుంది. అయితే మనసులో మాత్రం అంతులేని బాధే పేరుకుపోయి వుండటాన అందరితో కలసి సరదాగా, సంతోషంగా వుండలేకపోయింది. ఒకపక్కన కొడుక్కు దూరమయ్యాననే బాధ మనసును తొలుస్తుండగానే మరో బిడ్డకు తల్లి కాబోతోంది. ఈసారి కూడా బిడ్డనొదిలేసే పరిస్థితిని ఊహించుకుంటేనే హృదయం ఛిద్రమౌతోంది.

ఎవరు పలకరించినా ముక్తసరిగా జవాబు చెప్తోన్న మాధవిని చూస్తే అందరికీ చిరాగ్గానే వుంది. 'ఇంతకాలానికి దివోదాసుకు బిడ్డను కనివ్వబోతున్నానని అహంకారం' అనుకున్నారు కొందరు. కొందరు ఆరోగ్యం బాగాలేదు కాబోలని సరిపెట్టుకున్నారు. మరికొందరు బిడియమని, ఇంకొందరు అందకత్తె కనుక సహజంగానే పొగరని - రకరకాలుగా మాట్లాడుకున్నారు. సత్యవతి మాత్రం ఎలాంటి కోపాలు, భేషజాలూ లేకుండా పదేపదే పలకరిస్తూ సన్నిహితంగా మెలిగింది.

మాధవి కొంతసేపయ్యాక మేఖలను తీసుకుని కొద్దిదూరంలో వున్న చక్కటి పూలతీగ వద్దకు తీసికెళ్ళింది. అవి వంగరంగులో వున్నాయి.

"ఈ పూలు నాక్కూడా చాలా ఇష్టం మాధవీ, ఎంత చక్కటి పరిమళమో కదూ" అంది మేఖల.

"గమ్మత్తైన సువాసన. చుట్టూవున్న ఈ సన్నటి రేకలు వందుంటాయి. ఇవి కౌరవులనీ, ఈ ఐదు దళసరి రేకలు పాండవులనీ అంటారు"

"అయితే మధ్యలో వున్నది కర్ణుడు కాబోలు?!" అంది మేఖల.

"అవునుగానీ మేఖలా మనిద్దరం ఇక్కణ్ణించి పారిపోతే ఎలా వుంటుంది?" మెల్లగా అడిగింది మాధవి.

మేఖల ఆ మాట ఎవరైనా వినలేదు కదాని భయంగా చుట్టూచూసి "ఊరుకో మాధవీ, ఇలాంటి మాటలు ఎవరైనా వింటే చాలా ప్రమాదం" అంది గొణిగినట్లుగా.

మాధవి తన కోరికను స్నేహంగా వుండే మేఖలముందు వెల్లడించిందేగానీ అది ఆచరణసాధ్యం కాదని ఆమెకి బాగానే తెలుసు. ఉద్రేకం ఆపుకోలేక అనేసి, తర్వాత ఎందుకన్నానా అని బాధపడింది. 'ఈ జీవితం దుర్భరంగా వుంది. వేశ్యకంటే హీనంగా వుంది. ఇష్టాయిష్టాల ప్రమేయం లేకుండా కొన్నాళ్ళు ఓ రాజుదగ్గరుండటం, అతనితో బిడ్డ పుట్టగానే గాలవుడి వెంట కుక్కపిల్లలా వెళ్ళడం... ఇంతకంటే దారుణం ప్రపంచంలో మరేదైనా వుంటుందా? అందుకే వున్నపళాన ఇక్కణ్ణించి పారిపోయి బిడ్డను కని వాడి ఆలనాపాలనా చూసుకుంటూ బతకాలనిపిస్తోంది. ఈ జీవితంలో అంతకంటే ఆశలింకేం లేవు. కానీ తనకా అవకాశం వుందా? తానెక్కడికని పారిపోగలదు? తాను కనిపించకపోతే రాజు భటులను పంపి క్షణాల్లో వెతికించి పట్టుకోగలడు. అప్పుడు గర్భవతని కూడా చూడకుండా కొరడాదెబ్బలు కొట్టించినా ఆశ్చర్యంలేదు. కనుక తెలిసితెలిసి అలాంటి వెర్రిపని చేయలేదు. చేయలేకపోయినా లక్ష ఆలోచన్లు వస్తాయి. అవన్నీ ఇతర్లముందు ప్రస్తావిస్తే చులకనైపోవడం తప్ప ఒరిగేదేం వుండదు. తన రాత ఇలాగే వుంది. ఈ దుఃఖాన్నంతా అనుభవించి తీరాల్సిందే. ఏంచేసీ తప్పించుకోలేదు, ఎక్కడికీ పారిపోలేదు' అనుకునేసరికి ఆమె కళ్ళలోంచి రెండు బిందువులు రాలాయి.

కొన్ని పూలు కోసి ఇటు తిరిగిన మేఖల చూడనే చూసింది.

"బాధపడకు మాధవీ, మనిద్దరి పరిస్థితీ ఒకటే. గమ్యంలేని పడవలో ప్రయాణంలా వుంది. కాకపోతే అనవసరంగా ఇతరులు అనుమానించేలా మాట్లాడ్డమెందుకు చెప్పు? మనమెటూ పారిపోలేంకదా. పైగా ఇప్పుడు కనుక నువ్వలాంటి ప్రయత్నం చేస్తే సత్యవతిగారినీ ఇరికించినట్లవుతుంది. ఆవిడ చాలా మంచిది, నిన్ను కాస్త ఊరడించాలని ఈ ఏర్పాటు చేయించింది" అంది మేఖల.

"నాకు తెలుసు మేఖలా.. అది జరగనిపని అని తెలుసు. ఆకాశంలోకి ఎగరాలనిపిస్తోంది అన్నంతలో ఎగరగలనా?" అంటున్న మాధవి చేతిని ప్రేమగా తన చేతిలోకి తీసుకుంది మేఖల.

... ఇంకా ఉంది



మహారాణి సత్యవతి, పరిచారికల సానుభూతి మాధవికి సహాయపడ్డాయా?

దివోదాసు కోరిక ప్రకారం కొడుకునే కనిచ్చినా మాధవిని గాలవుడి వెంట పంపకుండా ఉండే అవకాశం ఇచ్చారా?

గడువుప్రకారం గాలవుడు వచ్చి మాధవిని బిడ్డనుంచి వేరుచేసి తీసుకెళ్ళాడా?

రాబోయే సంచికలో...

క్యాంపస్ ఛాట్

"ప్రతి ఒక్కరూ 'నీ నోట్సెంత బాగుందో...'అని లాక్కునేవారు. ఆ నోట్సు పై ఉన్న ముఖచిత్రం వాళ్ల అభిమాన తారదైతే... ఇక ఆ నోట్సు దాదాపు వాళ్లదగ్గరే ఉంటుంది. కాని నాలుగురోజులన్నా కాకముందే నా నోట్సు కాస్తా చిరిగిపోతుంది"

కె. శివలీల

హృతిక్... షాపులోనా...?

"ఏయ్... హృతిక్! ఎంత హాండ్ సమ్‌గా ఉన్నాడో....."అంటూ చేతులోకి తీసుకుందో అమ్మాయి.

"ఎంత సేపే. మాకిచ్చేదుందా లేదా?" అంటూ లాక్కుంది మరో అమ్మాయి.

"సో స్వీట్... ఇంకోటి దొరుకుతుందా? ఏ షాపులో కొన్నావ్?" ముక్త కంఠంతో అడుగుతున్నారు మరికొందరు.

"హృతిక్ షాపులో దొరకడమేంటి అనుకుంటున్నారా? అవును. ఇది నిజం! ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. ఎందుకంటే వీళ్లు మాట్లాడుతోంది నోట్ బుక్ పైన ఉన్న హృతిక్ ముఖచిత్రం గురించి!" అంటూ తన అనుభవాన్ని గుర్తుచేసుకుంది హేమ.

"ఆ సమయంలో అటువంటి బుక్ దొరకడమే నేనదృష్టంగా భావిస్తుంటే... అలాంటి బుక్ తామూ కొనుక్కోవాలని నా స్నేహితులంతా తాపత్రయపడుతున్నారు. ఇంతలో... లెక్చరర్ క్లాసులోకొచ్చారు. పాఠం చెప్పడం మొదలెట్టాడు. ఆయన దృష్టి డెస్కుపైనున్న ఆ పుస్తకం పై పడింది"

"స్టాండప్" అంటూ గట్టిగా అరిచారు.

నేను భయంగా లేచి నిలబడ్డాను. నా తోటి విద్యార్థులందరూ విస్తుపోయి చూస్తున్నారు.

"ఏంటది? మేగజైన్స్ కాలేజీకి తేవడం ఎప్పటినుంచి నీకలవాటు?" అని ఆవేశంగా అడిగరాయన.

"ఇది నోట్సండీ" అని నేను బెరుగ్గా సమాధానమిచ్చాను.



"నోట్ పుస్తకాలపై ఇలాంటి అట్టలా? వీటిని చూస్తూ పిల్లలు ఏకాగ్రతగా పాఠం వినగలరా...?" అంటూ ఉపన్యాసం దంచడం మొదలెట్టాడు. క్లాసు సంగతి మర్చిపోయారు. నన్ను కూర్చోమనీ చెప్పలేదు. 'హృతిక్ కోసం ఆ మాత్రం చేయలేనా...' అనుకుంటూ ఆ అవర్ మొత్తం నిలబడే ఉన్నా" నంటూ ముగించింది నీరజ.

''నేను ఇంటర్మీడియెట్‌లో ఉండగా నా స్నేహితురాలు ఓ పుస్తకం కొనుక్కొచ్చింది. దాని అట్టపైన అన్నీ జోక్సే! అవి చదువుతుండగా... ఇంగ్లీషు లెక్చరర్ క్లాసులోకొచ్చారు. ఆయన బోర్డువైపు తిరిగిన సమయంలో నేను వాటిని చదివాను. నవ్వాపుకోలేక పోయాను. ఆయన సీరియస్‌గా నా వైపు చూశారు. కంట్రోల్ చేసుకోలేకపోయాను. అంతే ఆయన కోపం తారాస్థాయికి చేరింది. నన్ను లేపి చెడమడా తిట్టేశాడు" అని తన అనుభవాన్ని గుర్తు చేసుకుంది జ్యోతి.

''బోర్డు వైపు తిరిగి లెక్చరర్ లెక్కలు చెబుతుంటారు... ఆయనటు తిరగ్గానే... మేం వాటిని గబగబా నోట్ చేసుకునేవాళ్లం. ఆయన మావైపు తిరిగేసరికి... మేం ఏమీ తెలీనట్లుండేవాళ్లం. మా సంగతి తెలిసిన ఆయన నోట్ బుక్ మూసి ఉంచమనే వారు. మూస్తే ఒక ఇబ్బంది. అదేమిటా అనుకుంటున్నారా? నోట్ బుక్ మీద మంచి సీనరీలో, మోడల్స్ బొమ్మలో ఉన్నాయనుకోండి... ఇక దాన్ని చూస్తూ లెక్క సరిగా వినలేకపోతాం. మా బాధ ఆ లెక్చరరుకెలా తెలుస్తుంది" అంటోంది హారిక.

ఆమె స్నేహితురాలు రజిత మాత్రం "నేనిది వరకూ హీరోహీరోయిన్ల ముఖచిత్రాలు గల నోట్సులు, ప్రఖ్యాత మోడల్స్ ఉన్న బుక్స్ కొనుక్కునేదాన్ని. అది క్లాసుకు తెచ్చిన రోజు నుంచీ ఒకటే బాధ. కనిపించిన ప్రతి ఒక్కరూ 'నీ నోట్సెంత బాగుందో...'అని లాక్కునేవారు. ఆ నోట్సు పై ఉన్న ముఖచిత్రం వాళ్ల అభిమాన తారదైతే... ఇక ఆ నోట్సు దాదాపు వాళ్లదగ్గరే ఉంటుంది. కాని నాలుగురోజులన్నా కాకముందే నా నోట్సు కాస్తా చిరిగిపోతుంది" అని చెబుతోంది లత.

ఇదివరకు ఎక్కువగా దేవుడి బొమ్మ ఉన్న నోట్సులే సర్వసాధారణంగా వచ్చేవి. ఎక్కువగా చదువులతల్లి అని సరస్వతీదేవి ఫొటో ఉన్నవే వచ్చేవి. లేదా మంచి సీనరీ ఉండేవి, జలపాతాలు కొండలు, సూర్యోదయాస్తమయాలు, జంతువుల బొమ్మలు ఇలా...అనేకరకాలు. అప్పుడప్పుడొచ్చే సినిమా యాక్టర్ల కవర్‌పేజీలు ఇప్పుడవే ఎక్కువగా వస్తున్నాయి. మారే ట్రెండ్‌కనుగుణంగా ఏ హీరో హిట్టో ఆ హీరో ఫొటో ఉన్న నోట్సులకు మంచి డిమాండ్ కదామరి! బోయ్ స్టూడెంట్స్ హీరోయిన్ల బొమ్మలు, గర్ల్ స్టూడెంట్స్ హీరోల బొమ్మలున్నవాటిని ఎన్నుకోవడంలో సహజాతి సహజమైన సైకలాజికల్ ఇన్‌స్టింక్టేనని మానసికశాస్త్రవేత్తలంటుంటారు కూడా. సో...ఇటీజ్ జస్ట్ క్వయిట్ నేచురల్లే గానీ... వారివారి అభిరుచుల వ్యక్తీకరణగా ఇట్టే పసిగట్టేయడానికి చేతినిండి దొరికిపోయినట్లే కదా!

ఏనీ వే... ఫేవరేట్ స్టార్ ముఖచిత్రమున్న నోట్సులను కొనడం మీ హాబీనా? క్లాసు మధ్యలో వాటిని చూస్తూ ఊహల్లో తేలిపోతున్నారా? పాఠం బుర్రకెక్కాలంటే వెంటనే వాటికో అట్ట వేసేయండి. మనసొప్పడం లేదా? అయితే మీ హాబీని కాస్త మార్చుకోండి. వీలుకాదా? మీ లెక్చరర్ ఇచ్చే క్లాసు భరించే ఓపిక మీకుందేమో ఆలోచించుకోండి.

సినిమా కబుర్లు

చరిత్రలో నిలిచిపోయిన 'భక్త రామదాసు'

పులగం చిన్నారాయణ

శ్రీ రాముడు పేరు వింటేనే మనకు భద్రాచలం గుర్తుకు వస్తుంది. భద్రాచలం అనగానే ఆటోమేట్టిగ్గా భక్త రామదాసే స్ఫురణకు వస్తాడు. రామాలయానికి సూత్రదారి, పాత్రధారి భక్త రామదాసు. రాముడికోసం సర్కారు ఖజానాను వినియోగించి జైలు పాలయ్యాడు. కర్మకాండను తిరస్కరించే సంఘ సంస్కరణా దృక్పథం రామదాసులోనూ ఉంది. ఆలుబిడ్డల్ని వదిలి ఆకులు, కాయలు తింటూ అడవిలో తపస్సు చేస్తే మోక్షం రాదంటాడు. రామదాసు కూడా బాహ్యాచారాలను ఖండించి సామాజిక చైతన్యాన్ని ఆశించాడు.

భక్తపోతనగా...., 'త్యాగయ్య'గా...., 'యోగి వేమన...' గా తెలుగు తెరపై సాక్షాత్కరించిన నాగయ్య క్రీ॥ శ. 1650 నాటి 'భక్తరామదాసు' గా ప్రసిద్ధిగాంచిన కంచర్ల గోపన్న చరిత్రను తెరకెక్కించడానికి ఉద్యుక్తు లయ్యారు.

నైజాం ప్రాంతాల రజాకార్ ఉద్యమం ప్రారంభమైన రోజుల్లో హిందూ ముస్లింల ఐక్యత కోసం 'రామదాసు' సినిమా చేయమని ప్రముఖ వ త్రి కా రచయిత, నైజాం కొలువులో ఉన్నత ఉద్యోగి ఈశ్వరదత్తు చొరవ చూపడంతో నాగయ్య 'రామదాసు' చేయడానికి ఉత్సాహం కనబరిచారు.

గోల్కొండ, భద్రాచలం, నల్లగొండ, నిజామాబాదు ఇత్యాది ప్రాంతాలన్నీ తిరిగి బయ్యల రామకృష్ణారావు, ఈశ్వరదత్తు సహకారంతో నాగయ్య భక్త రామదాసు చిత్ర కథను రూపొందించారు. నాగయ్య బడ్జెట్ చెబితే సినిమాకయ్యే ఖర్చంతా నైజాం ప్రభుత్వమే భరిస్తుందని నాటి హైదరాబాద్ స్టేట్ ప్రధాని లయాఖాలీ హామీ ఇచ్చారు.

మద్రాను వచ్చాక సముద్రాల రాఘవాచార్యులతో కలిసి కథని ఒక కొలిక్కి తీసుకువచ్చారు. ఈలోగా హైదరాబాద్‌లో పోలీసు యాక్షన్ వచ్చి ఆ ప్రయత్నం ఆగిపోయింది. కథ, వగైరాలు సిద్ధంగానే ఉన్నాయి. కాబట్టి నాగయ్య ఆ సినిమాను నిర్మించడానికి పూనుకున్నారు. 1959లో ఆరంభమైన ఈ సినిమా రామదాసులాగే నాగయ్యను ఎన్నో కష్టనష్టాలకు, ఇబ్బందులకూ గురి చేసింది.

> ఈ సినిమా రామదాసులాగే నాగయ్యను ఎన్నో కష్టనష్టాలకు, ఇబ్బందులకూ గురి చేసింది.

ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే ముఖ్యపాత్రధారులైన కన్నాంబ, గౌరీనాథశాస్త్రి, సి.ఎస్.ఆర్. డాక్టర్ గోవిందరాజు సుబ్బారావు చనిపోయారు. కబీరు పాత్రధారి గౌరీనాథశాస్త్రిపై మూడొంతులు పైగా తీసిన దృశ్యాలను మళ్లీ మొదటి నుండీ గుమ్మడిపై చిత్రీకరించాల్సి వచ్చింది. 'కమల'గా నటించిన కన్నాంబ అకాలమరణం చెందడంతో కొన్ని దృశ్యాల్లో డూప్ షాట్స్ తియ్యవలసి వచ్చింది. ఆమె లేకపోవడం వల్ల డబ్బింగ్ చెప్పవలసిన చోట టి.జి. కమలాదేవి చెప్పారు. డూప్‌గా కూడా కమలే నటించిందని అంటారు. ఐతే నాగయ్య మాత్రం ' ఆ మహాతల్లి నాకు అన్యాయం చెయ్యలేదు. నా పని పూర్తి చేసి మరీ వెళ్లిపోయింది' అని చెప్పేవారు.

రాజా నరసింహారెడ్డిగా ఒకే ఒక్క సన్నివేశంలో నటించిన గోవిందరాజు సుబ్బారావు అకాలమరణం పొందడంతో ఆ పాత్రని అక్కడితో సరిపెట్టేశారు.

ఇలా అనేక కారణాల రీత్యా నాగయ్య ఆర్థికంగా బాగా దెబ్బతిన్నారు. అప్పులు చేయాల్సి వచ్చింది. సినిమా పూర్తి కావడానికి అయిదేళ్ల కాలం పట్టింది. రఘురాముడిగా పాలబుగ్గలతో మొదటి సన్నివేశంలో కనిపించిన మాస్టర్ నాగరాజు చివరి సన్నివేశంలో ముదురుగా కనిపిస్తాడు. దాన్ని బట్టే ఈ సినిమా ఆలస్యాన్ని అంచనా వేయవచ్చు.

నాగయ్యమీద అభిమానంతో ఎన్టీఆర్, ఏయన్నార్, శివాజీ గణేషన్, అంజలీదేవీ 'రామదాసు'లో అతిథి (దేవతా) పాత్రలు పోషించి చిత్రానికి శోభను చేకూర్చారు. ఓ సందర్భంలో రామలక్ష్మణులిద్దరూ తానీషా దగ్గరకు వెళ్ళి రామదాసు చెల్లించవలసిన బకాయిని తామే చెల్లిస్తారు. ఇక్కడ శ్రీహరిగా అక్కినేని, లక్ష్మీదేవిగా అంజలీదేవీ, రామునిగా ఎన్టీఆర్, లక్ష్మణునిగా శివాజీ గణేషన్ కనిపిస్తారు. ముఖ్యంగా శ్రీహరి రామునిగా మారిపోయే సన్నివేశంలో అక్కినేని మాయమై ఎన్టీఆర్ ప్రత్యక్షం కావడం ప్రేక్షకుల్ని ఉబ్బితబ్బిబ్బులు చేసింది.

తానీషా పాత్రను ఆనాటి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అధ్యక్షులు, కళాకోవిదులు పసల సూర్యచంద్రరావు పోషించారు. విజయవాడలో న్యాయవాదిగా పనిచేసే విన్నకోట రామన్న పంతులు, సీతారామశాస్త్రిగా అభినయించారు.

ఈ సినిమాలో నటించిన వారిలో ముగ్గురే ముగ్గురు ఇప్పుడు మన మధ్య ఉన్నారు. అక్కినేని, అంజలీదేవి, గుమ్మడి. "నిజజీవితంలో వారికంటే ఇరవై సంవత్సరాలు చిన్నవాడినైనా నేను రామదాసుకు గురువైన కబీరు పాత్ర ధరించాను. మొదటిరోజు షూటింగ్‌లో గురువుగా నన్నొక ఉన్నతాసనంపై కూర్చొబెట్టి రామదాసు దంపతులు (నాగయ్యగారు, కన్నాంబగారు, కబీరుకు పాదపూజ చేసే ఘట్టం చిత్రీకరణ రిహార్సిల్సు చేస్తున్నాం. రిహార్సిల్సులో నా కాళ్ళు పట్టుకోవడం ఎందుకని పైకి పెట్టుకుని కూర్చున్నాను. ఆయన ఒప్పుకోకుండా 'నేను పాదపూజ చేసేది కబీరుకు గానీ, గుమ్మడి వెంకటేశ్వరరావుకు కాదు. కాళ్ళు పళ్లెంలో పెట్టండి' అన్నారు నాగయ్యగారు"... అంటూ ఆనాటి సంఘటన గురించి చెప్తారు గుమ్మడి.

ఇందులో మొత్తం 46 పాటలు, పద్యాలు ఉన్నాయి. ఏడు కబీరు భజనలను మహమ్మద్ రఫీ, నాలుగు పద్యాలను మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆలపించారు. రామదాసు కీర్తనలనే యథాతథంగా ఉపయోగించారు. 'మా బావ మంచి వాడు...' పాటను సముద్రాల రాశారు. ఇంకా ఘంటసాల, పి.బి. శ్రీనివాస్, మాధవపెద్ది సత్యం, టి.జి. కమలాదేవి అతిథి గాయకులుగా టైటిల్ సాంగ్ పాడారు. కబీరు పాటలన్నీ మహమ్మద్ రఫీ ప్రత్యేకంగా బొంబాయి నుంచి వచ్చి పైసా పారితోషికం తీసుకోకుండా పాడారు.

23 డిసెంబర్ 1964న చిత్రం విడుదలైంది. కాసుల వర్షం కురిపించింది. "కానీ ఇంతవరకూ నా చేతికి మాత్రం అందలేదు. పరిస్థితుల ప్రభావం వల్ల ఈ చిత్రానికి సంబంధించిన నా అభిమానులైన వారినందరినీ బాధపెట్టాను' అని అప్పట్లో వాపోయారు నాగయ్య.

నటునిగా, నాగయ్యకిది 73వ చిత్రం.

అప్పట్లో 'రామదాసు' పడిన కష్టాలే ఇప్పుడు 'రామదాసు' సినిమా తీసి నాగయ్య పడ్డారని అటు పరిశ్రమవాళ్లు, ఇటు ప్రేక్షకలోకం బాధపడ్డారు.

ఏది ఏమైనా గానీ 'రామదాసు' కథాంశం మళ్ళీ తెరకెక్కుతోంది. 'అన్నమయ్య'తో అఖిలాంధ్ర ప్రేక్షకుల్ని అలరించిన నాగార్జున, కె. రాఘవేంద్రరావు జోడీ ఈసారి 'రామదాసు' అనే బృహత్తర ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

చిన్నారి చిత్రకారులు

బి.హరిత,
10వ తరగతి,
అందెవారి వీధి,
పాత మంగళగిరి,
గుంటూరు.



జి.సునీత,
10వ తరగతి,
జడ్‌పిహెచ్ స్కూల్,
రెడ్డివారిపల్లి,
సోదుమ్.

బి. వెంకటేష్,
8వ తరగతి,
అందెవారి వీధి,
పాత మంగళగిరి,
గుంటూరు.



అరటిపండు తినేది ఎవరబ్బా!



బుజ్జాయిలూ! పై బొమ్మ చూశారుగా. అందులో... ఎవరో మీకు పెట్టకుండా అరటిపండు లాగించేస్తున్నారు గబగబా. ఎవరైవుంటారు? వారి తోక మాత్రం ఇంత బారున వుంది. ఊహించడం ఎందుకుగాని. ఎంచక్కా చుక్కలన్నీ కలిపెయ్యండి తెలిసిపోతుంది.

రంగులు పులిమేద్దామా

పర్వతాన్ని చేరాలంటే...

ఏమేం దాక్కున్నాయి?

హేయ్ నేస్తాలూ...ఇవాళ మీకు ఓ సులభమైన పరీక్ష పెడదామనుకుంటున్నాం. పైన చక్కటి దృశ్యం వుందికదా. అందులో సరిగ్గా **తొమ్మిది** ప్రాణులు వున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

23.10.05కు సరైన సమాధానాలు రాసినవారు

కె.రంగీత్ నాయక్, (7), ఎపిటిడబ్ల్యు స్కూల్, బాలానగర్. ఆర్.అనిల్ కుమార్ (10), జెడ్‌పిహెచ్‌ఎస్, ధన్‌వాడ, మహబూబ్ నగర్. ఎం.ఉదయ్ కుమార్, ఎస్‌సి హాస్టల్, చిన్నపారల. పి.రేవంత్, (7), సిఎస్ఐ మిషన్ హైస్కూల్, వరంగల్. ఎస్. రేణుక, (8), జెడ్‌పిఎస్‌ఎస్, మద్దూర్, వరంగల్. వి.సంతోష్ కుమార్, (10), చిరునోముల, బోనకల్, ఖమ్మం. ఎ.అప్పల రాజు, (4), దేవుపల్లి, విజయనగరం. ఎం. గోపి, (7), జెడ్‌పిహెచ్ స్కూల్, వేల్పూరు. నేరెళ్ల సాయి, (7), జెడ్‌పిహెచ్ స్కూల్, వేల్పూరు. దుస్సా అక్షయ్ కుమార్, (5), జనగామ. టి.వి.యల్ నాయక్, శ్రీవాణి విద్యాలయం, జనగాం. మారోజు కిరణ్మయి (9), శ్రీవాణి విద్యాలయం, జనగామ. ఎన్. మేఘన, మిర్యాలగూడ, నల్లగొండ. దిల్‌షెడ్ బేగం, (3), నలంద పబ్లిక్ స్కూల్, విశాఖపట్నం. పి.అమర్ జయసింహ, గవరపాలెం, అనకాపల్లి, విశాఖపట్నం. కె.మణిదీప్, (9), జిహెచ్ స్కూల్, టంగుటూర్, ప్రకాశం. వి.సుమంత్, (6), నెహ్రూ హైస్కూల్, అద్దంకి. రాళ్ళబండి సాయికిరణ్ (4), విశ్వశాంతి హైస్కూల్, శ్రీరాంపూర్. మేడపాటి వెంకట లక్ష్మి, (6), వెలివెల గ్రామం, పాలకొల్లు. వి.సౌమ్య, (3), పావన్ తేజ పబ్లిక్ స్కూల్, అమలాపురం. పి.శ్రీనివాసరావు, (6), బ్రిలియంట్ గ్రామర్ స్కూల్, సూర్యాపేట, నల్లగొండ. ముంద్రు మనోహర్, (7), జెడ్‌పిహెచ్ స్కూల్, వేల్పూరు. ఎన్. ప్రణీత్, (6), గౌతం మోడల్ స్కూల్, మాలికిపురం. ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, (10), సిద్దార్థ రెసిడెన్షియల్ హైస్కూల్, కోదాడ. ఎం.డి. సంజీద్, ముద్దాయిపేట్, ఎసిజెసి తాండూర్, రంగారెడ్డి. డి.ఆంజనేయులు , సంజు, ఎడవెళ్ళి. కె.శ్రీ తన్మయ, (3), గుంటూరు. కె.రవికౌషిక్, (5), చీరాల. కె.కృష్ణా రెడ్డి, (10), వికాస్ రెసిడెన్షియల్ స్కూల్. మహ్మద్ అలీ, (9), దెందుకూరు. నరమనేని అనీల్ కుమార్, (9), జెపి.ఎస్.ఎస్, దెందుకూరు. బాబు నరేంద్రప్రసాద్, (8), కె.విజయ్ కుమార్, (10), బి.రవితేజయాదవ్, (10), ఎస్. కవీంద్ర, (10), యు.ఎస్ అనిల్, (10), నరసింహులు, (10), షబ్బీర్ హుస్సేన్, (10), యు.ఈరన్న, (10), ఆర్.రంజాన్, (10), యు.ఎం అనిల్, (10), యం. ప్రసాద్, (10), యు. రాజశేఖర్, (10), యం.అనుదీప్, (10), జి నాగేష్, (10), కె.యం యాసీన్, (10), జి. విజయ్ ప్రకాశ్, (10), యం. తిమ్మప్ప, (10), యు. నాసీర్, (10), యం రాజేశ్, (10), బి.శ్రీనివాసులు, (10), శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. బి.సృజన, (8), గీతాంజలి హైస్కూల్, అశోక్ నగర్, హైదరాబాదు. టి .చరణ్ కుమార్, టి .కరుణ్ కుమార్, కల్వకుర్తి, మహబూబ్ నగర్. కె .మణిదీప్, (9), శివాలయం వీధి, టంగుటూరు. ఆర్.వంశీకృష్ణ, (6), జెడ్‌పిహెచ్ స్కూల్, మొగళ్ళూరు. వి సుమంత్, (6), నెహ్రూ హైస్కూల్, అద్దంకి. పి. కళ్యాణి, కోదాడ, నల్లగొండ. శరత్, (5), శ్రీ వెంకటేశ్వర కాన్వెంట్, పెడన. (బ్రాకెట్‌లోని అంకె వారు చదువుతున్న తరగతి)

30.10.05 సమాధానం:
ఆంధ్ర రాష్ట్రం మ్యాప్



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో తెలుసా! ఈమె గొప్ప శాస్త్రవేత్త. రసాయన, భౌతిక శాస్త్రాలలో నోబెల్ బహుమతిని పొందిన తొలిమహిళ. అంతేకాదర్రా! ఈమె రేడియంను కూడా కనుగొన్నారు. ఏంటి ఇప్పుడు తెలిసిపోయిందా! అయితే వెంటనే కార్డుమీద సమాధానం రాసి పోస్ట్ చెయ్యండే. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

అట్టమీది కథ

డా॥ కాకర్లమూడి విజయ్



ఒకప్పుడు సృష్టి అంటే ఏమిటో...దాని విధానమేంటో సామాన్యులకు ఓ పట్టాన అర్థమయ్యేది కాదు. మనుషులెట్లా పుట్టారో...వారి శరీరంలో ఉండే కణాలూ, అవెలా తయారౌతాయో అస్సలు తెలియదు. కానీ ఈరోజున ఎంతో కొంత మామూలు మనుషులకు కూడా తెలుస్తోంది. మనుషులను పోలిన మనుషులను పుట్టిస్తున్నారు. కాదు కాదు...సృష్టిస్తున్నారు. "మాట్రిక్స్" సినిమాలో లాగా ఒకే విలన్ వంద క్లోనువిలన్లుగా తయారై ఫైటింగ్ చేసేయడం ఎంత మాయ అనుకున్నామా...అలా ఎంతమందినైనా జెరాక్స్‌కాపీల్లాగా మనుషులను తయారుచేసేస్తారేమో అన్నంత స్పీడుగా ఉంది క్లోనింగ్ ప్రక్రియ...ఈ సైన్సు వింతావిష్కరణ ఇంకెంత విడ్డూరమో చూద్దాం!

సృష్టికి ప్రతి సృష్టి!

"ఆ యిదేళ్ల ఓ అబ్బాయికి కిడ్నీ పాడైంది. అతనికి సరిపోయే కిడ్నీ దొరకడం కష్టం అవుతున్నది. డాక్టర్ల సమావేశం. చర్చలు, నిర్ణయాలు నిపుణులను రప్పించారు. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అబ్బాయిని బ్రతికించడానికి అత్యంత అధునాతన శాస్త్రీయ ప్రక్రియని వాడనున్నారు. ఆ అబ్బాయి కణాలను తీశారు. మరొక స్త్రీ (తల్లికాదు) అండాన్ని తీశారు. ఆ అండం నుండి క్రొమోజోములను తీసేసి, అబ్బాయి కణాలలోని క్రోమోజోములను ఎక్కించారు. గర్భం దాల్చిన ఆ స్త్రీ ఒక అబ్బాయిని ప్రసవిస్తుంది. ఆ అబ్బాయి నుండి ఒక కిడ్నీ తీసి, అసలు ప్రమాదంలో ఉన్న అబ్బాయికి అమర్చుతారు. కొత్త కిడ్నీ అచ్చం తన కణాల నుండి రావడం వలన ఇబ్బంది లేకుండా ఆరోగ్యం కుదుటపడుతుంది.

ఒక్క కిడ్నీ మిగిలిన అబ్బాయి చిన్నవాడే కాబట్టి శరీరం తదనుగుణంగా మారి ఒక కిడ్నీతోనే ఇబ్బంది లేకుండా జీవిస్తాడు. అబ్బాయిని పిల్లలు లేని వారికి దత్తతకిస్తారు. రోగి, కిరాయి అమ్మ, కొత్త పిల్లాడు, దత్తత తీసుకున్నవారు - అంతా హేపీ...."



ఈ సంఘటన సైన్సు ఫిక్షన్ రచనలో భాగమనుకునేలా ఉన్నా వాస్తవదూరంగా ఉన్నది మాత్రం కాదు.

మానవ జీవనానికి సంబంధించిన ప్రాథమికమైన కణాలపై ప్రయోగాలే ఒక కొత్త శకానికి తెరలేవనున్నాయి. దాంతోపాటే ఇప్పటి వరకు కల్పిత ఆలోచనలు వాస్తవ రూపం దాల్చనున్నాయి.

ఈ పరిణామాలకు ఆశ్చర్యపోయేవాళ్ళు కొందరైతే, అనుమానంగా చూసేవాళ్ళు మరికొందరు ఏతావాత ఈ తాజా శాస్త్రీయ ఆవిష్కరణలు రాబోయే కాలంలో మానవాళిని సహజ పరిణామపథం నుండి సంచలనాత్మకంగా ప్రక్కదోవ పట్టించవచ్చు. మరి అది మంచికా ? చెడుకా ? ఇప్పటికైతే అనుమానమే.

జీవికి జెరాక్స్ కాపీలు

ఈ అద్భుతాన్ని క్లోనింగ్ అంటున్నారు. ఒకానొక పదార్థాన్ని గానీ జీవాన్ని గానీ అచ్చం మరోనకలు తీయడమే "క్లోనింగ్". సహజంగా ఈ ప్రక్రియ ప్రకృతిలో అనేక సందర్భాలలో జరుగుతూనే ఉంటుంది. ఉదాహరణకి ఒక మొక్క కొమ్మని తిరిగి నాటితే, ఆ కొత్త మొక్క మొదటి దాని క్లోనే.

కానీ ప్రస్తుత పరిస్థితులలో క్లోనింగ్ ఏదో ఒక ఉద్దేశ్యంతో చేయడమే ప్రత్యేకత. ఆ ఉద్దేశ్యాలు మంచివా, మానవాళికి ఉపయోగపడేవా అనే ప్రశ్న మాత్రం నిత్యనూతనంగా ఉన్నదే.

శాస్త్రీయ విజ్ఞానం అనువర్తితం అయినప్పుడు- అంటే మానవాళికి ఏదో ఒక రకంగా ఉపయోగపడేటప్పుడు దాని వల్ల అంతా మంచే జరుగుతుందన్న హామీ ఏమీలేదు. ఉండదు. గతంలో అణుబాంబు కనుగొన్నప్పుడూ అంతే, జెనెటిక్ ఇంజనీరింగ్ ఆవిష్కరించినప్పుడూ అంతే. జనసామాన్యానికి అతి సామాన్యమైపోయిన సినిమా, టీవీ, సెల్‌ఫోన్ కూడా అంతే. వాటివల్ల మానవాళికి మంచి జరిగిందా, నష్టం వాటిల్లుతుందా అనేది వాదనలకి అతీతమైంది కాదు.

శాస్త్రవేత్తలు 1980లలో అభివృద్ధి చెందిన జీవులపై ప్రత్యేకించి క్షీరదాలపై క్లోనింగ్ పరిశోధనలు ప్రారంభించారు. త్వరితగతిని విజయవంతమౌతున్న పరిశోధనలు మానవ క్లోనింగ్ దిశలో చర్చలు లేపాయి. అందులో భాగంగా శాస్త్ర రంగంలోనూ, జనబాహుళ్యంలోనూ మానవ క్లోనింగ్‌ను అనుమతించాలా" అని ప్రశ్నలు, కూడదు అని సమాధానాలూ ముందుకొచ్చాయి. మానవ క్లోనింగ్‌లో 'కేంద్రక మార్పిడి' (న్యూక్లియర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) పద్ధతి ఒకటి . దీని ప్రకారం - ఒక కణాన్ని (అది ఏ కణమైనా సరే) తీసి, అందులోని కేంద్రకాన్ని మరొక అండంలో ప్రవేశపెట్టి, ఆ అండాన్ని స్త్రీ గర్భాశయాల్లో అమర్చుతారు.

డాలీ "మేఁ...మేఁ" అంది కానీ...

ఈ క్రమంలో డాలీ అనే క్లోన్ చేయబడ్డ గొర్రె ఆవిర్భావం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. స్కాట్‌లాండ్ శాస్త్రవేత్తలు పై పద్ధతిని ఉపయోగించి, జూలై 5, 1996న డాలీని జన్మింపచేశారు. డాలీ సృష్టికి మూడు ఆడగొర్రెలు అవసరమయ్యాయి. ఒక చనిపోయిన గొర్రె కణాలను మరొక గొర్రె అండంతో అనుసంధానం చేశారు. ఆ అండాన్ని మూడవ గొర్రె గర్భాశయంలో ఉంచారు.

డాలి పెరిగి, పెద్దదైతే సహజ పద్ధతులలోనే పిల్లల్ని కూడా కంది. కానీ,



క్లోనింగ్ గొర్రె డాలీ



పిల్లలు పుడతారని తెలిస్తే దంపతులలో ఆరోగ్యంగా ఉన్న ఒకరి కణాలతో సంతానాన్ని సృష్టించడం, తన జన్మరహస్యం తెలిసిన తరువాత ఆ సంతానంలోని మానసిక వేదన, అసలు ప్రకృతి పరమైన సంతానోత్పత్తి ప్రక్రియలో కృత్రిమత్వం... ఇవన్నీ క్లోనింగ్‌ను వ్యతిరేకించే వారి వాదనలు.

ఇంత చేసినా... క్లోన్లు సంపూర్ణమైన ఆరోగ్యంతో దీర్ఘకాలం బ్రతుకుతాయని చెప్పలేం. పెద్దవాళ్ళ కణాలతో తయారైన క్లోన్లలో ఈ భయం మరీ ఎక్కువ. ఒక వేళ క్లోన్ సాధారణంగానే జన్మించినా కనీసం 20 ఏళ్ళ వరకూ ఆగితేగానీ ఏ సమస్యలూ రావన్న నిర్ణయానికి రావచ్చు. ఎంతైనా ప్రస్తుతానికి క్లోనింగ్ ఒక జూదం లాంటిదే. కచ్చితంగా ఫలితాన్ని ఆశించలేము, ఊహించలేము.

కొన్ని అవాంఛనీయ పరిస్థితులూ ఎదురయ్యాయి. పుట్టిన 6 నెలలకే డాలీకి క్షీర గ్రంథులు (పాలిండ్లు) అభివృద్ధి చెందాయి. బహుశ ఒక ప్రౌఢజీవి కణాలను క్లోన్ చేయడం వల్ల అలా జరిగి ఉండవచ్చు. కానీ డాలీ 14 ఫిబ్రవరి, 2003)న తీవ్రమైన దీర్ఘకాలిక శ్వాస సమస్యలతో చనిపోయింది. ఇందుకు కారణం క్లోనింగ్ వైఫల్యమే అంటారు.

స్టెమ్‌సెల్ థెరపీతో వైద్యం

అసలు క్లోనింగ్ వలన మానవులలో ఎన్నో రకాల వ్యాధులకి పరిష్కారం లభిస్తున్నది. కొందరి అభిప్రాయం. అయితే ఇలువంటి ప్రక్రియలో పెద్ద జీవుల శరీర కణాల కంటే మూలకణాలు (స్టెమ్ సెల్స్) వాడితే మరింత విజయవంతం అయ్యే అవకాశం ఉందని గ్రహించారు.

స్త్రీ గర్భాశయంలో అండంతో పురుషశుక్రకణం కలిసి పిండకణం ఏర్పడుతుంది. ఒక్క పిండ కణం విభజనలు చెంది 5-6 రోజులలో 120 కణాలుగా మారుతుంది. ఈ 120 కణాలు అనిర్దేశిత కణాలు అంటే ఒక్కో మూలకణమూ మానవ శరీరంలోని దాదాపు 200 రకాల కణాలలో దేనిగా అయినా మార్పు చెందగలదు. అలా ఒక్కో కణమూ ఒక సంపూర్ణ మానవుడిగా మనకు అవసరమైన కణాలుగా మార్చుకోవడమే తాజా అభివృద్ధి

ఇప్పటికీ ఈ దిశలో చాలా దూరం ప్రయాణించారు. అనేక రకాల జీవులను క్లోన్ చేయడమే కాకుండా, రహస్యంగా మానవులనూ క్లోన్ చేశారన్నది వాస్తవం. అదే విధంగా స్టెమ్ కణాలను సేకరించే క్రమంలో వేలాది పిండాలు (మానవ) ధ్వంసం అయ్యాయన్నదీ వాస్తవమే. కాని వాస్తవంలో రెండు సవాళ్లున్నాయి. 1. మూలకణాలను మనకు కావలసిన కణాలలాగే ఎలా మార్చాలి ? ఆ మార్చిన కణాలు శరీర ప్రతిచర్య జరపకుండా ఎలా అంగీకరించాలి. శాస్త్రం అవరోధాల్ని అధిగమించి విస్తృతమయింది. దాంతో పాటే దానిపై వివాదాలు కూడా పెరిగాయి.

కాబట్టి అసలు మూలకణాలను ఎక్కడి నుండి స్వీకరించాలన్నది సమస్య అయింది. పెద్దవాళ్ళ ఎముకల మజ్జలో కూడా మూల కణాలుంటాయి. గానీ అవి అప్పటికే ఏ కణాలుగా మారాలో నిశ్చితమై ఉంటాయి. శాస్త్రీయంగా సరైనది, నైతికంగా సమస్యాత్మకమైనదీ అయిన పద్ధతి -మానవ పిండాల నుండి వీటిని సేకరించడం

కృత్రిమ గర్భధారణ పద్ధతులలో (సంతాన సాఫల్య కేంద్రాల నుండి) సఫలం కాని పిండాలూ, అనవసరమైనవీ, అబార్షన్లలో సేకరించినవీ వాడి ఇప్పటి వరకూ క్లోనింగ్ ప్రక్రియను చేస్తున్నారు. ఒకటి, రెండు కణాల కోసం ఏకంగా ఒక పిండాన్నే నాశనం చేయడం సబబేనా అన్నది ఒక ప్రశ్న ఈ విధమైనవి దొరకని పక్షంలో కొన్ని కణాలకోసం ఏకంగా పిండాన్నే సృష్టించి (క్లోన్ చేసి), కావలసిన కణాలని తీసి, ఆ పిండాన్ని ధ్వంసం చేయడం మరో పద్ధతి మరి ఈ పద్ధతి. ఎంత వరకు సరైనది అన్నది ఇంకో ప్రశ్న ఆ విధంగా తయారైన కణాలని వాడటం ఎంత వరకూ సమంజసం అన్నది మరో ప్రశ్న.

ఇది ఇలా ఉంటే, మానవులను క్లోన్ చేయడం వలన సంప్రదాయబద్ధంగా వస్తున్న కుటుంబ విలువలు మసకబారిపోతాయన్నది ఒక వాదన. తన కణాల నుండి పుట్టిన క్లోన్‌కి తను తండ్రి/తల్లి అనుకోవాలా లేక తన కవల అనుకోవాలా ?

అకస్మాత్తుగా మరణించిన ఒక సంతానం నుండి కణాలని తీసి మరొక 'కాపీ' సంతానాన్ని పొందడం, జన్యుపరమైన సమస్యలు/వ్యాధులతో

క్లోన్‌గ్రాండ్ మా...
క్లోన్‌మమ్మీ... క్లోన్‌డాడీ.. క్లోనీబావా!

ఇవి ఆరోగ్య సమస్యలైతే, మానసిక సమస్యలు ఎలా ఉంటాయో చూద్దాం. ఒక క్లోన్ తన తల్లే తనకు అక్క అనీ, తన అమ్మమ్మ తన అమ్మ అనీ, తన తండ్రి, తన బావ అనుకోవచ్చు! అలా పెరిగే క్లోన్‌ని చూస్తే తనే పెరుగుతున్న భావన ఆ తల్లిలో /తండ్రిలో కలుగుతుంది.

తన భర్త/తన భార్య రూపంలో ఉన్న (కనీసం రూపంలో) క్లోన్ పిల్లల్ని చూస్తే ఆ దంపతులలో మానసిక పరిస్థితి అందోళన కరంగా ఉండవచ్చు. ఇలా, అటు తల్లిదండ్రుల వైపుల నుండీ, క్లోన్ కాబడ్డ పిల్లల వైపునుండి తీవ్ర మానసిక ఒత్తిడి కలగడం ఖాయం. దీన్ని పరిష్కరించే మానసిక వైద్యుడు బహుశ ఎవరూ ఉండరేమో.

మానసిక సమస్యలు ఇలా ఉంటే అసలు టెక్నాలజీని దుర్వినియోగపరచే అవకాశమూ క్లోనింగ్‌లో మెండు. బయోటెక్నాలజీని మానవాభివృద్ధి కంటే మానవాళి వినాశనం, స్వప్రయోజనం, శాడిజం కొరకు వాడి ఆనందించే వారు ఎక్కువ ఉన్నారు.

అయితే మానవ క్లోనింగ్‌లో అన్ని భయాలూ, అనుమానాలే ఉండనవసరం లేదని నిపుణులు అంటున్నారు. ఉదాహరణకి హిట్లర్ కణాలతో ఓ వంద మంది హిట్లర్లని క్లోన్ చేస్తే కూడా, వారందరూ హిట్లర్‌లాగా కనిపించవచ్చు. కానీ అలాగే ప్రవర్తించరని అంటున్నారు. ఎందుకంటే ప్రవర్తన పరిసరాల ప్రభావం వల్ల ఆవిర్భవించేది-జన్యువుల వల్ల కాదు కాబట్టి క్లోనింగ్‌తో భయపడ వలసినంత ప్రమాదం ఉండకపోవచ్చని వీరి వాదన. ఇందులో కొంత మాత్రమే వాస్తవం. ఇంకో రకంగా, క్లోనింగ్ (స్టెమ్ కణాలతో) అనేక ముదురు వ్యాధులకూ, అవయవ మార్పిడిలకూ అత్యంత ఆశాజనకంగా ఉంటుంది.

టెక్నాలజీ అనేది రెండు వైపులా పదునున్న కత్తి. ప్రతి కొత్త



టెక్నాలజీ ప్రక్రియలోనూ వివాదాస్పద అంశాలుండటం మామూలే. కృత్రిమ గర్భధారణ వచ్చిన కొత్తలో "టెస్ట్‌ట్యూబ్ బేబీలా?" అని అనుమానం, వ్యతిరేకత ప్రదర్శించిన నేపథ్యం నుండి ఈ రోజు అదే ప్రక్రియ లక్షలాది సంతానం లేని వారికి అశాదీపంగా మారడం అందరం చూసిందే.



క్లోనింగ్, స్టెమ్ కణాల పరిశోధన ప్రస్తుతం తొలి దశలోనే ఉన్నట్టు లెక్క. దీని అసలు ప్రభావాలూ, పరిణామాల పట్ల సంపూర్ణ అవగాహనకు రావడం కష్టం. అయినా ప్రజలూ, మత పెద్దలూ, కొంత మంది శాస్త్రవేత్తలూ వ్యక్తపరచిన వ్యతిరేకత వలన చాలా దేశాలు ఈ పరిశోధనల్ని నిషేధించాయి/నియంత్రించాయి.

మానవుడు మరో సృష్టికర్తగా మారి కొత్తసృష్టిని రచిస్తుంటే ఆనందాశ్చర్యాలు కలుగుతున్నా... అదే మానవుడిని గాడి తప్పించే లక్షణం ఈ సృష్టిని కొత్త సృష్టితో ఏం చేస్తుందా అని భయాందోళనలూ కలుగుతున్నాయి. చూద్దాం. వేచి చూద్దాం.

స్టెమ్‌సెల్ బ్యాంకు అపురూపమైంది, అవసరమైంది

లైఫ్‌సెల్ హైదరాబాద్ బ్రాంచి అధిపతి నవీన్ పరేక్‌తో ప్రజాశక్తి

ప్రసవం అవ్వగానే శిశువుల బొడ్డుతాడు కోసి తల్లినుంచి వేరు చేస్తారు. తరతరాలుగా మంత్రసానులు, హాస్పటళ్లలో నర్సులు, డాక్టర్లు అలా చేయడం సహజంగా జరిగిపోతోంది. కానీ ఆ బొడ్డు తాడులో ఉండే రక్తంలో ఉండే మూలకణాలు ఎంతో విలువైనవనీ, ఎన్నో రకాల వ్యాధులను నయంచేసే అద్భుతమేదో వాటిలో ఉందని నూతనపరిశోధనలు తెలియజేస్తున్నాయి. ప్రసవం తరువాత మనకు తెలియక లక్షలకొలది బొడ్డుతాళ్లు(అంబిలికల్ కార్డ్‌లు) అనవసరంగా చెత్తలో పారేస్తున్నాం. కానీ ఇటీవల వాటిలో ఉండే స్టెమ్ కణాలు ఆ శిశువు కుటుంబీకులందరికీ చికిత్సకు "స్టెమ్‌సెల్ థెరపీ"కి ఉపయోగించుకోవచ్చని తెలుసుకున్నారు. అందుకే ఆ అంబిలికల్ కార్డు బ్లడ్‌లో నుంచి కొన్ని మూలకణాలను తీసి జాగ్రత్త చేసే స్టెమ్‌సెల్ బ్యాంక్‌లు వెలిశాయి. వాటిలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో "లైఫ్‌సెల్ అనే సంస్థ దేశంలో ప్రముఖ నగరాల్లో నెలకొల్పింది. వాటిలో ఒకటి మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా ఏర్పాటుచేశారు. లైఫ్‌సెల్ హైదరాబాద్ బ్యాంక్‌కు చెందిన నవీన్ పరేక్ ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు.

ప్ర. హైదరాబాద్‌లో ఈ స్టెమ్‌సెల్ బ్యాంక్ సేవలు ఎలా ఉన్నాయి?

నవీన్ పరేక్ : ఈ మూలకణాలను భద్రపరిచే బ్యాంక్ ఆసియో క్రయో–సెల్, అమెరికాకు చెందిన క్రయో సెల్ ఇంటర్‌నేషనల్‌వారి సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్న సంస్థ. ప్రపంచంలోనే మొట్టమొదటిదే కాక అతిపెద్ద స్టెమ్‌సెల్ బ్యాంకు ఇది. అత్యంత ఆధునిక ప్రమాణాలతో కూడిన సదుపాయాలు, సాంకేతిక ఏర్పాట్లతో ఈ బ్యాంకు నిర్వహిస్తున్నాం. హైదరాబాద్‌లో ఇటీవలే దీన్ని నెలకొల్పాం. అయితే దీనికి ఆశించినంత స్పందనయితే రాలేదు. బహుశా సరైన రీతిలో ప్రజలు అర్థం చేసుకోలేకపోవడమో, ఈ మూలకణాల వల్ల కలిగే ప్రయోజనం, దానిని ఇలా దాచుకోవచ్చనే సమాచారం లేకపోవడంవల్ల అనుకున్నంత స్పందనలేదు.

ప్ర. సేకరించిన మూలకణాలను ఎలా జాగ్రత్త చేస్తారు?

నవీన్ : ప్రసవం అవ్వగానే బొడ్డుతాడు కత్తిరిస్తారు కదా. బిడ్డ జన్మించాక శిశువు నాభి నాళం, మావిలలో మిగిలి ఉండే రక్తం ఓ ప్లాస్టిక్ కవర్‌లో గానీ సిరంజీద్వారా గానీ తీసి గడ్డకట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. 25మి.లీ. ల సీసాల్లో ఉంచి మైనస్198 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద చాలాకాలం కాపాడ్డానికే ఈ బ్యాంక్‌లో ఏర్పాట్లు చేశాం.

ప్ర. ఇప్పటికి ఎంతమంది ఈ బ్యాంక్‌సేవలను వినియోగించుకున్నారు.

నవీన్ : హైదరాబాద్ నగరవాసులలో దాదాపు 50 మంది, రాష్ట్రంలోని విజయవాడ, రాజమండ్రి, విశాఖ, కాకినాడ, అదిలాబాద్ తదితర ప్రాంతాలవారు మరో 30మంది తమ శిశువుల స్టెమ్ కణాలను భద్రపరిచిన కస్టమర్లగా ఉన్నారు. 21సంవత్సరాల పాటు భద్రపరిచినందుకు రూ.60,000/- ఫీజుగా వసూలు చేస్తున్నాం. మధ్యతరగతి వారికోసం కూడా ఈ సేవలు విస్తరించడానికి సులువు వాయిదా పద్ధతిని కూడా ప్రవేశపెడుతున్నాం.

ప్ర. ఈ బ్యాంక్‌లకు ఎలాంటి అడ్డంకులు, అభ్యంతరాలెదురయ్యాయి?

నవీన్ : అడ్డంకులేవీ ఎదురవ్వలేదు. రాష్ట్రపతి అబ్దుల్ కలాం లాంటివారినుండి కూడా ప్రోత్సాహమే లభించింది. సాంప్రదాయవాదులు కూడా అనేకమంది దీనికి మద్దతు పలికారు. ఏవో కొన్ని సాంప్రదాయ క్రిస్టియన్ సంస్థలు మాత్రమే వ్యతిరేకించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని గిరిజన ప్రాంతాలవారికి కూడా దీని ఉపయోగాలను వివరించి చెప్పాం. అనుకూల స్పందనే వచ్చింది.

ప్ర. ఇలాంటి మూలకణాల నిక్షిప్త కేంద్రాలకు ఎలాంటి భవిష్యత్తుందని భావిస్తున్నారు?

నవీన్ : రానున్న మూడునాలుగేళ్లలోనే మంచి భవిష్యత్తు ఈ బ్యాంకులకుంటుందని భావిస్తున్నాను. ఈ పద్ధతిలో తమ శిశువుల మూలకణాలను భద్రపరుచుకోవడం చాలా ముఖ్యమైందని ప్రజలు అనుకుంటారు. ఎందుకంటే మా బిడ్డకు చెందిన మూలకణాలను జాగ్రత్తపరిచాం...ఇక ఏం పరవాలేదనే ధైర్యం ఉంటుంది. అనేక ప్రమాదకర జబ్బులొచ్చినా కుటుంబమంతా కాపాడుకోవడానికి తగిన ముందుజాగ్రత్తలో ఉన్నామనే మనశ్శాంతితో ఉంటారు. ఇది చాలు ముందుముందు ఇలాంటి సౌకర్యాలు అభివృద్ధి చెందుతాయనడానికి. మరో కారణం ఏమంటే మధుమేహ వ్యాధికి జీవితమంతా వాడే ఇన్సులిన్ తదితర మందుల ఖర్చుతో పోల్చుకుంటే ఈ స్టెమ్‌సెల్ థెరపీ చాలా చవకైనది కావడం. అందువల్ల ముందుముందు ఈ స్టెమ్ కణాలను భద్రపరిచే కేంద్రాల అవసరం చాలా ఉంటుంది.

ఆరోగ్యం

విటమిన్ల కథ

డాక్టర్ నాగినేని భాస్కరరావు

రైబోఫ్లావిన్ లేదా విటమిన్ బి2 నీటిలో కరుగుతుంది. ఇది శరీరంలో నిల్వ ఉండదు. కనుక క్రమంగా ఆహారం ద్వారా దీని లోటును భర్తీ చేయాలి. ఆమ్లం వల్లగాని, వేడి చేసినప్పుడుగాని, ఆక్సీకరణ ద్వారా గానీ రైబోఫ్లావిన్ నాశనం కాదు. ఇది జీర్ణకోశంలో శోషించబడుతుంది.

సహ ఎంజైములైన ఫ్లావిన్‌మోనో న్యూక్లియోటైడు, ఫ్లావిన్ ఎడినిన్ డైన్యూక్లియోటైడు పాల్గొనే అన్ని ఆక్సీకరణ, క్షయకరణ ప్రక్రియలలో రైబోఫ్లావిన్ ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. దీని రోజువారీ అవసరం 1.2 నుంచి 1.6 మి.గ్రా. ఉంటుంది. గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, బాల్యంలో పెరుగుదలకు ఇది అధికంగా అవసరం.

సరిగ్గా ఆహారం తీసుకోకపోవడం వల్ల రైబోఫ్లావిన్ లోపం వస్తుంది. రైబోఫ్లావిన్ లోపం పెల్లాగ్రా, క్వాషియోల్‌కార్‌లతో కలిసి ఉంటుంది. పారిశ్రామిక దేశాల్లో ఈ లోపం దీర్ఘకాలిక రోగాలైన క్యాన్సర్, ఇతర జబ్బులు, తాగుబోతుల్లో కన్పిస్తుంది.

ఇది లోపిస్తే పెదాలు, నోరు, నాలుక మంటగానూ, పుండ్లు పడి ఉంటాయి. వెలుగును చూడలేరు. కళ్ళలో మంట, దురద ఉంటాయి. పెదాలపై పుండ్లు పడి నోటి కణాలకు వ్యాపించి పుండ్లు పడతాయి. చెక్కులు కడతాయి. నాలుకపై కూడా పుండ్లు పడతాయి. నాలుక ఊదారంగుకు కానీ, ఎరుపు రంగుకు కానీ మారి లోతైన చీలికలతో ఉంటుంది. కంటిపొర ఎర్రబడటం, కంటి రెప్పలు వాయడం, నీరు రావడం జరుగుతుంది. రైబోఫ్లావిన్ ఇచ్చినట్లయితే అవి తగ్గిపోతాయి. ముఖంపై చర్మం కూడా ప్రభావితం కావచ్చు.



ఎక్కువ కాలం విటమిన్ బి2 తక్కువగా ఉన్న ఆహారం తీసుకున్న వారిలో 24 గంటల మూత్రంలో రైబోఫ్లావిన్ ఎంత విసర్జింపబడిందో పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు లేదా ఒక మి.గ్రా. రైబోఫ్లావిన్‌ను చర్మం కింద ఇంజక్షను ద్వారా ఇచ్చి నాలుగు గంటల తర్వాత మూత్రంలో ఎంత విసర్జింపబడిందో పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. 24 గంటల్లో మూత్రంలో 50 మి.గ్రా. కన్నా తక్కువ ఉన్నా లేక నాలుగు గంటల్లో 20 మి.గ్రా. కన్నా తక్కువగా ఉన్నా ఆ పరిస్థితిని రైబోఫ్లావిన్ లోపంగా పరిగణించాలి.

రైబోఫ్లావిన్ లోపాన్ని రైబోఫ్లావిన్ అధికంగా లభించే ఆహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చును. పూటకు 5 మి.గ్రా. రైబోఫ్లావిన్ మాత్రను నోటి ద్వారా రోజూ రెండు పూటలా కొద్ది రోజులు వాడాలి. కొద్ది రోజులకు ఈ లోపం లక్షణాలు తగ్గుతాయి. కానీ పూర్తిగా తగ్గడానికి కొన్ని వారాలు పడుతుంది. అయితే మిగతా విటమిన్లను కూడా ఇవ్వాలి. పాలు, కాలేయం, మూత్రపిండాలు, చేప, గుడ్లు, వెన్న, ఆకు కూరలలో రైబోఫ్లావిన్ బాగా లభిస్తుంది. ✪



కథ

కొల్లూరి సోమశంకర్

సానుభూతి కూడా ఖరీదే

'మేనేజ్‌మెంట్ గుర్తించే లోపే ఈ నిజం చెప్పడం మంచిదా? అసలు నేను నిజంగానే తప్పు చేశానా?' అని చరణ్ తనలో తానే ప్రశ్నించుకున్నాడు.

తను చేసింది తప్పో... కాదో అర్థం కావట్లేదు.

అతనికి ఆందోళనగా ఉంది. ఆఫీసులో సూట్‌కేస్, కిట్ అప్పజెప్పాడు. జరిగిన సంగతెవరికీ చెప్పలేదు. ఇంటికొచ్చేశాడు. ఆఫీసు నుంచి ఫోన్లేవీ రాలేదు. చరణ్‌కు టెన్షన్ పెరిగిపోతోంది.

ఏమీ తేల్చుకోలేకపోతున్నాడు. తనకిచ్చిన స్టాకులోంచి వస్తువులు తగ్గాయి. వాటిని సంస్థ కోసం ఉపయోగించినట్లు ఆధారాలేమీ లేవు. ఉద్యోగం ఊడిందంటే రోడ్డున పడడం ఖాయం. పైగా ఈ మధ్యే పెళ్లయింది. చరణ్‌కు తలనొప్పి మొదలైంది. భార్య ఇచ్చిన కాఫీ తాగుతూ ఆలోచనల్లోకి జారుకున్నాడు.

చరణ్‌ది మధ్యతరగతి కుటుంబం. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. మేనమామ చేసిన ఆర్థిక సహాయంతో ఇంటర్ వరకూ చదవగలిగాడు. బట్టలు కొట్లో, పచారీ కొట్లో రెండేళ్లపాటు పనిచేశాడు. మేనమామ మిత్రుడొకరు సహాయం చేస్తే 'మేల్ హెల్త్ అసిస్టెంట్' పోస్టు కోసం శిక్షణ పొందాడు. ప్రభుత్వోద్యోగం దొరుకుతుందేమోనని కొన్నాళ్లు వేచిచూశాడు. అమ్మకు వయసు మీదపడుతోంది. మేనమామకు కుటుంబ బాధ్యతలు పెరుగుతున్నాయి. చరణ్ అందరికీ భారమౌతున్నాడు.

ఊరికొచ్చిన ఓ స్వచ్ఛంద సంస్థలో హెల్త్ వర్కర్‌గా ఉద్యోగం చేశాడు. ఒక ఏడాది గడిచిపోయింది. చరణ్ ఫస్ట్ ఎయిడ్ ఇవ్వడంలో నైపుణ్యం సంపాదించాడు. కానీ ఆ సంస్థవారు ఆఫీసు మూసేసారు. ఆ సంస్థ యజమానికి చరణ్ పనితీరు బాగా నచ్చి ఒక విజిటింగ్ కార్డిచ్చాడు. హైదరాబాదులోని ఒక వ్యక్తిని కలుసుకోమన్నాడు.

తన బయోడేటా కాపీలు తీసుకుని హైదరాబాదుకు చేరాడు. ఆయన చరణ్‌ను తనకు తెలిసిన వారి వద్దకు పంపారు. వారు వెంటనే ఉద్యోగమివ్వక పోయినా 'మళ్లీ కలవండి' అనేవారు. ఇలా ఆర్నెల్లు గడిచిపోయాయి. తెచ్చుకున్న డబ్బులైపోయాయి. మావయ్యనడగాలంటే సిగ్గుగా ఉంది. అతనిలో నిస్పృహ పెరిగిపోయింది.

ఈ తరుణంలో నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రి 'ఎమర్జెన్సీ సర్వీసుల' తమ టోల్ - ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే ఏ సమయంలోనైనా అత్యవసరమైన వైద్య సేవలందిస్తామని ప్రకటించింది. అవసరమైన వారు ఆ నెంబరుకు ఫోన్ చేసిన వెంటనే సుశిక్షితులైన సిబ్బంది మోపెడ్‌పై సంఘటనా స్థలానికొచ్చి ప్రథమ చికిత్స చేస్తుండాలి. ఈ లోపల అన్ని పరికరాలూ ఉన్న అంబులెన్సు వచ్చి గాయపడిన వారిని తమ హాస్పటల్‌కు తీసుకువెడతుంది.

ఇలా మోపెడ్‌పై తిరిగే పదిమందిలో ఒకడిగా చరణ్ ఎంపికయ్యాడు.

"హమ్మయ్య... పర్వాలేదు. జీవితంలో కాస్త స్థిరపడ్డాను" అని అనుకున్నాడు చరణ్. మరదలిని పెళ్లి చేసుకుని, మల్కాజ్‌గిరిలో కాపురం పెట్టాడు. అంతా సాఫీగా సాగిపోతుందనుకుంటున్న తరుణంలో...

ఒక యాక్సిడెంట్ కేసుకు హాజరయ్యాడు చరణ్. గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేశాడు. తమ అంబులెన్సు రాగానే ఆసుపత్రికి పంపాడు. తన షిఫ్టు ముగిసింది. డ్యూటీ హాండోవర్ చేసి ఇంటికి బయలుదేరాడు. ఇంతలో రోడ్డు మీద వేగంగా వెడుతున్న ఓ యువకుడి బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ యువకునికి దెబ్బలు తగిలాయి. చరణ్ వెంటనే తన బండాపాడు. సూట్‌కేస్ కిట్‌లోని మందులతో ఆ యువకునికి 'ఫస్ట్ ఎయిడ్' చేశాడు. కాలికి చిన్న దెబ్బలే తగిలాయి. కానీ చేతికి మాత్రం ఫ్రాక్చరైనట్లు గ్రహించాడు.

"మీకు సిమెంటు కట్టుకట్టాలి. మా అంబులెన్సుకు ఫోన్ చేస్తాను. మా ఆసుపత్రికెళదాం" అన్నాడు చరణ్.

"వద్దండి. మా ఆఫీసు వాళ్లు హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తారు. మా పానెల్ హాస్పటలుంది. అక్కడైతే డబ్బు కట్టక్కర్లేదు. ఫస్ట్ ఎయిడ్ చేసినందుకు చాలా థాంక్స్" అంటూ చరణ్ మొబైల్ ఫోన్ నుంచే ఆ అబ్బాయి తన బంధువుకు ఫోన్ చేసి పిలిపించుకుని వెళ్లిపోయాడా యువకుడు. చరణ్ చూస్తుండిపోయాడు. బండి నడుపుతూ ఆలోచించసాగాడు.

"కేసు ఆసుపత్రికి రాలేదు. కాబట్టి ఫస్ట్ ఎయిడ్‌కైన ఖర్చు నన్నే పెట్టుకోమంటారేమో? ఒక కేసు పోగొట్టానని మెమో ఇచ్చి జీతం కట్ చేస్తారేమో? మొత్తానికే ఉద్యోగంలోంచి తీసేస్తారేమో?" ఇలాంటి ఆలోచనలు చరణ్‌లో భయాన్ని కలిగించాయి. ఈ విషయాన్ని ఆఫీసులో చెప్పాలో వద్దో తేల్చుకోలేకపోతున్నాడు. ఇంతలో సెల్‌ఫోన్ మోగింది. హాస్పటల్ నుంచేమో అనుకున్నాడు. రాంగ్ నెంబర్.

తను చేసింది సరైందో కాదో తేల్చుకోలేకపోతున్నాడు చరణ్. వృత్తి ధర్మం ప్రకారం తప్పే. అధికారులకు తెలీకుండా ఆఫీసు వస్తువులు వాడడం, వాటి లెక్కలు చెప్పలేకపోవడం నిస్సందేహంగా నేరమే. కానీ మానవతా ధర్మం ప్రకారం తను చేసింది నూటికి నూరుపాళ్లూ సక్రమమే.



వాళ్లమ్మ గారు నూరిపోసిన 'ధర్మో రక్షతి రక్షితః' అన్న సూత్రాన్ని గుర్తు చేసుకున్నాడు చరణ్. సంగతంతా భార్యకు చెప్పాడు.

''అనవసరంగా బెంగ పడకండి. మీరు మంచి పనేచేశారు. అయినా కచ్చితంగా జరుగుతుందో లేదో తెలియని ప్రమాదం గురించి భయపడకండి" అంటూ ధైర్యం చెప్పిందామె.

సంగతంతా ఆఫీసులో చెప్పేసి, అవసరమైతే డబ్బులను తన జీతంలోంచి కట్ చేసుకోండని చెప్పాలని నిర్ణయించుకున్నాడు చరణ్. ఇప్పుడతని మనసు కుదుటపడింది.

సామాజిక సేవలు ప్రైవేటీకరణాభూతం పరమయ్యాక పక్కవాడి గురించి కన్నీళ్లు కార్చాల్సివచ్చినా అందుకు ఖరీదు లెక్క వేసుకుని ఎవరికి వారే భరించుకోవడమంటే ఇదేనేమో... ✪

పప్పెట్ ఇంటర్వ్యూ

ఇదే సహా'కారం'

సింధు

యథా ప్రకారం పట్టువదలని విక్రమార్కుడు మర్రిచెట్టును సమీపించాడు. వానకు తడిచి, ఎండకు ఎండి, చలికి నిద్రలేక అలసిపోయిన భేతాళుడు ఉదయపుటెండలో చిన్నపాటి కునుకు తీశాడు. విక్రమార్కుని భారీ అడుగులతో కూడిన కుదుపుకు భేతాళుడికి మెళుకువ వచ్చింది. బడలికకు వళ్ళు నొప్పులు తోడై సన్నగా మూలిగాడు. భేతాళుని మూలుగుతో ఉలిక్కిపడ్డ విక్రమార్కుడు నడక ఆపేశాడు. "ఏంటి భేతాళా! ఆరోగ్య బాగా....?" విక్రమార్కుని ప్రశ్న ముగియకుండానే "నేనుండేది మర్రిచెట్టు మీదకద రాజా. ప్రకృతి సహకారం లేక కాస్త పడిశం పట్టింది. వళ్ళు భారకించింది" అన్నాడు భేతాళుడు. "సహకారం లేనప్పుడు సమస్యలు తప్పవుగా... అయినా నే సహకరిస్తాను. ముందు వైద్యుని వద్దకెళదాం" అంటూనే విక్రమార్కుడు అడుగు ముందుకేయబోయాడు. "వైద్యం మీ శరీరాలకుగానీ, నాకేంటి రాజా..." అంటూనే విక్రమార్కుడికి మాట్లాడే అవకాశం లేకుండా మళ్ళీ భేతాళుడే ప్రారంభించాడు. "అయినా సహకారం ఇవ్వడం మీ మనుషులకేం తెలుసు రాజా" అంటూ భేతాళుడు విక్రమార్కుణ్ని దెప్పి పొడిచాడు. దీంతో విక్రమార్కుడికి పౌరుషం పొడుచుకొచ్చింది. "మా మనుషుల్లోని మానవత్వాన్నే పరిహసిస్తున్నావ్ భేతాళా... సహకారంతోనే మానవాళి పురోగమించింది. సమష్టి కృషితోనే ఆటవికదశ నుండి ఆధునిక దశకు చేరింది. సుఖమయ జీవితాన్ని పొందగలిగింది" ఈ మాటలకు తిరుగులేదన్నంత ధీమాతో తిప్పికొట్టాడు విక్రమార్కుడు. "ఓయబ్బో... మాబాగా చెప్పావులే మహారాజా! సహకారం కోసం భూలోకంలో జరుగుతున్న ఎన్నికల్లో ఎంత సహకారముందో ఒక్కసారి పరికించండి. మానవుల సహ 'కారం' ఏ పాటిదో మీకే తెలుస్తుంది." భేతాళుడి మాటలతో విక్రమార్కునికి ఎక్కడలేని కోపమొచ్చింది. కళ్ళు ఎర్రబడ్డాయి. "నిర్ధారణలేని నిందలూ వెటకారాలూ మీకే తగును భేతాళా" అనగానే భేతాళుడు స్పందించి "అయితే సహకార సంఘ ఎన్నికల్లో ఏం జరిగిందో ఆ శాఖా మంత్రి కన్నా లక్ష్మినారాయణ్నే కలుద్దాం పద. ఆయన మాటల్లోనే మీ సహకారం గురించి చెప్పిస్తాను" ఈ మాటలు చెబుతూనే భేతాళుడు రిపోర్టర్ అవతారం ఎత్తాడు. విక్రమార్కుడు కెమెరామెన్‌గా మారాడు బివి(భేతాళ,విక్రమార్క)టివి తరఫున కన్నా లక్ష్మీనారాయణ ముందు ప్రత్యక్షమయ్యారు.

బి.తాళ్,విక్రమార్క్: నమస్తే సార్! (యుగళ గీతంలా రాగయుక్తంగా ప్రణామం చేశారు)

మంత్రి: రండోయ్! రండి. ఉరుములూ, మెరుపుల్లేకుండా ఊరికే రారు మహానుభావులు. విశేషమేంటో చెప్పండి.

బి.తాళ: సహకార ఎన్నికలు జరుగాయి కదా సార్! దానిపైనే ఇంటర్వ్యూకోసం వచ్చాం. సహకార వ్యవస్థ లక్ష్యమేంటిసార్?

మంత్రి: నిస్సహాయులకు చేయూత నివ్వడం. ప్రయివేటు వడ్డీల నుంచి రక్షించడం.

బి.తాళ్: చాలా గొప్పలక్ష్యంతోనే ఏర్పరిచారు. మరి అంతగొప్ప లక్ష్యసాధన కోసం జరుగుతున్న ఎన్నికల్లో... దాడులూ హత్యలూ ఎందుకు జరుగుతున్నాయి సార్?

మంత్రి: అవునండీ. పులివెందుల్లో తెలుగుదేశపోళ్ళ ఘాతుకాన్ని చూశారు కదా! తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సతీష్‌రెడ్డి గన్‌మెన్‌తో కాల్పులు జరిపి మా పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తల ప్రాణాలు బలిగొన్నారు.

బి.తాళ్: అనంతపురం జిల్లా మారాల సొసైటీ నామినేషన్ల సందర్భంగా మీ వాళ్ళు కూడా ఒక టిడిపి కార్యకర్తను కత్తితోపొడిచి...

మంత్రి: మరి టీడీపోళ్ళు రెచ్చిపోతుంటే మా వాళ్ళూరుకుంటారా? వాళ్ళలాగే అక్కడక్కడా రెచ్చిపోతున్నారు.

బి.తాళ్: చేయూతనిచ్చేందుకే సహకార రంగం ఏర్పాటుచేస్తే... ఓటు కోసం వేలూ... అధ్యక్ష పదవికోసం లక్షలూ... ఖర్చుపెట్టాలా? ఖమ్మం, అనంతపురం సొసైటీల్లో రూ.50తో ప్రారంభమైన ఓటు విలువ ఎన్నికలు దగ్గరకొచ్చేకొద్దీ అనంతపురం జిల్లా రాచానపల్లి సొసైటి పరిధిలోని నారాయణపురంలో రూ5వేల నుంచి రూ.10వేలకు పెంచినట్టు వార్తలొచ్చాయి...



మంత్రి: ఓటర్లలా మారిపోయారు. ఏం చేద్దాం మరి? ('అబ్బ! ప్రజలపై నిందేసి ఎంత బాగా తప్పుకున్నాడూ?' మనసులో భావాన్ని వెలికి రానీయకుండానే)

బి.తాళ్: ప్రకాశం జిల్లా వెల్లలచెరువు సొసైటీ అధ్యక్ష పదవిని రూ5.5 లక్షలకూ.. కుందూరు అధ్యక్ష స్థానాన్ని రూ.1.90 లక్షలకూ వేలం పాడి దక్కించుకోవడం వంటి సంఘటనలను కూడా...

మంత్రి: ఎవరో కొందరు వ్యామోహపరులనుబట్టి.... (మంత్రి పక్కదారి పట్టించే చర్చ సాగిస్తుండటంతో భేతాళుడు నిజం పలికించే అతీతశక్తుల్ని ఆయనపై ప్రయోగించారు) చూడు భేతాళా. నిజం చెప్పాలంటే... రాజులకాలం నుంచి గ్రామాల్లో పెత్తనం సాగించే భూస్వాముల వారసులేనయ్యా వాళ్ళు. ఇప్పటి అధికారంలోనూ వాళ్ళు భాగస్వాములే. ఆ అధికారాన్ని వదులుకోమంటే జార విడుస్తారా? దాన్ని నిలుపుకోవడం కోసం... అవసరమైతే వేలూ లక్షలూ కుమ్మరిస్తారు. దాంతో పనికాదనుకుంటే... అడ్డంగా నరికిపోగులేస్తారు. ఏది చేస్తేనేం... అధికారం వాళ్ళ చేతుల్లో ఉండాలి. అదే వాళ్ళ లక్ష్యం.

బి.తాళ్: అంటే మీ పార్టీలో భూస్వాములుండి... తెలుగుదేశం పార్టీలో పేదలున్నారా?

మంత్రి: పిచ్చోడా... 'అందుగలడిందులేడను సందేహము వలదన్నట్టు' అన్ని పార్టీల్లో వాళ్ళేనయ్యా. వాళ్ళ ప్రయోజనాలు నెరవేరని వామపక్షాల్లో తప్ప మిగిలిన అన్ని పార్టీల్లో వాళ్లే కదయ్యా. ఓటర్లపై ఎవరిని మించి ఎవరికి పట్టుందో అంగ, అర్ధబలాలతో తేల్చుకోవడమే ఈ సంఘర్షణల సారాంశం. తెలుగుదేశమైనా, బిజెపి అయినా. కాంగ్రెస్ అయినా...అందరి వైఖరీ ఇదే. అన్నింటిలోనూ వాళ్ళే. అందరికీ అధికారమే పరమావధి... (గీతోపదేశంలా సాగిపోతున్న మంత్రి ప్రసంగపై తన సందేహాన్ని ఇక ఆపుకోలేకపాయాడు భేతాళుడు)

బి.తాళ్: మరి చేయూత నివ్వడానికి ఇంతటి కృషీ... పట్టుదలా.... అవసరమంటారా?

మంత్రి: ఓ అదా నీ సందేహం...మరి సహ'కార'మంటే అలాగే ఉంటుంది. డబ్బులెక్కడుంటాయో అక్కడ వీళ్లుంటారు. వీళ్ళతో మేమూ (మంత్రులు) ఉంటాం. ఎన్నికల్లో పెట్టేది పెట్టుబడే తప్ప ఖర్చుకాదు. పెట్టుబడికి మించిన లాభాన్ని ఈ రంగానికి కేటాయించిన నిధులనుంచే రాబట్టుకుంటారు. అన్ని నిధులున్నాయి కనుకే గొంతుకోత పోటీలు జరాగాయి. ఈ యేడాదే చూడు. ఒక్క పంట రుణాల కిందనే 13,300 కోట్ల రూపాయలు ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

బి.తాళ్: అవి చిన్న, సన్నకారు రైతుల కోసం...

మంత్రి: ఏ పేరు పెట్టినా అన్ని అవతారాలూ అంగ, అర్థ బలం ఉన్న వాళ్ళే ఎత్తగలరయ్యా. భక్తులు ఏ నైవేద్యం పెట్టినా అన్నీ భగవంతునికే చేరినట్టు (తనకున్న నమ్మకాన్ని ప్రస్తావిస్తూ) డబ్బులు ఏ పేరిట విడుదల చేసినా అన్నీ వాళ్ళకే చేర్తాయి.

బి.తాళ్: ధన్యవాదాలు సార్... చాలా చక్కగా నిజాలు చెప్పారు. (అంటూనే ఇద్దరూ అదృశ్యమయ్యారు) "ఇప్పుడేమంటావు విక్రమార్కా? ఈ ఎన్నికలు సహకారం కోసం జరిగేనవే అయితే ఇంత ఘాటుగా ఉండేవి కావు. వీటి వెనకున్న సహ'కారం' ఇప్పటికైనా అర్థమైందా" అనగానే విక్రమార్కుడు అంగీకారయోగ్యంగా తలొంచాడు. విక్రమార్కుని ఓటమితో భేతాళుడు అదృశ్యమై తుర్రున జమ్మిచెట్టుపైకి పారిపోయాడు.

మనమూ- మన నమ్మకాలు

ఓ స్త్రీ రేపు రా!

డా॥ దేవరాజు మహారాజు

"తమ్ముడూ ! నువ్వేమో రాకరాక వచ్చావు. మా ఊళ్లోనేమో పరిస్థితులు బాగాలేవు. అందులో నువ్వు కొత్తగా పెళ్ళయిన వాడివి. ఏమౌతుందో ఏమో అని దిగులుగా ఉందిరా!" అని అనసూయమ్మ ఆందోళన పడింది. హైదరాబాద్ నుండి వచ్చిన శేఖర్‌కు విషయమేమిటో అర్థం కాలేదు. అదే అడిగాడు.

"ఏమైందక్కా ? ఊళ్ళో ఏం జరుగుతోంది ? బస్సు దిగి వస్తుంటే చూశాను అందరి ఇంటి తలుపుల మీద " ఓ స్త్రీ రేపురా !" అని రాసి ఉంది. ఎందుకూ ?"

అనసూయమ్మకు దుఃఖం ఆగలేదు. భోరుమని ఏడ్చింది. శేఖర్ అక్కని దగ్గరికి తీసుకుని విషయమేమిటో చెప్పమన్నాడు.

"అర్థరాత్రి అమ్మవారు షికారు కొస్తోందటరా తమ్ముడూ ! ఆమె ఎవరి ఇంటి తలుపు తడితే ఆ ఇంట్లో వాళ్ళు ఒకరు చచ్చిపోతారట. అందుకే అందరూ వీధి గుమ్మాల మీద "ఓ స్త్రీ రేపు రా !" అని రాసుకున్నారు. అట్లా రాస్తే రేపు మళ్ళా వద్దాంలే అనుకుని ఆమె వెళ్ళిపోతుందట. అదొక నమ్మకం. తలుచుకుంటేనే గుండె ఆగిపోయేట్టుగా ఉందిరా తమ్ముడూ. మేమే ఏ ఊరైనా వెళ్ళిపోదామనుకుంటూ ఉంటే.... అనుకోకుండా నువ్వొచ్చావు. వచ్చావన్న సంతోషం లేదురా తమ్ముడూ" అనసూయమ్మ మళ్ళీ ఏడుపు ప్రారంభించింది.

శేఖర్ ఉన్న ఫళాన పెద్దగా నవ్వాడు. అనసూయమ్మ ఆశ్చర్యపోయింది. "అక్కా ! ఎంత పిచ్చిదానివే నువ్వు ? ఇంతో అంతో చదువుకున్నావు కూడా ! అయినా బావగారేరీ ? ఆయన అయినా ఊళ్ళోవాళ్ళకు చెప్పొచ్చు కదా ? ఇలాంటి వదంతులు నమ్మే ఊళ్ళు ఇంకా ఉన్నాయన్న మాట. ఎవరైనా కొంతమంది రాత్రిపూట కాపలా కాసి నిజమేమిటో తెలుసుకోవచ్చు కదా ?" అన్నాడు శేఖర్. అతను ఉద్యోగరీత్యా నేషనల్ లేబరేటరీలో సైంటిస్టుగా పని చేస్తున్నాడు. మూఢనమ్మకాల్ని ఛేదించడమంటే అతనికి ఆసక్తి మెండు. ఈ ఊరికి వచ్చినందుకు ఇక్కడ అలాంటి సమస్య ఉందని తెలిసింది. దాన్ని సత్వరం పరిష్కరించి, గ్రామస్థులకు ధైర్యం చెప్పిపోవాలి అని మనసులోనే అనుకున్నాడు. ఇంతలో అనసూయమ్మ తమ్ముడికి మరి కొన్ని వివరాలు ఏకరువు పెట్టింది.

"ఇప్పుడు మరొకటి మొదలైందిరా శేఖర్ ! ఎవరి వీధి గుమ్మం మీద ఒక్క అంకె వేసుంటే వాళ్ళు వంద రూపాయలు, గొర్రెపోతు, కల్లుముంతా గడప బయట పెట్టి తలుపు వేసుకోవాలి. రాత్రిపూట ఎవరైనా తలుపు తెరచి చూడడానికి ప్రయత్నిస్తే రక్తం కక్కుకుని చస్తారట !"

" అదిసరే- ఊరి పెద్దలంతా ఏం చేస్తున్నారే అక్క ?"

"తేల్చడానికి ఏముంది ? ఊరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అందరూ ఆ కట్టడికి కట్టుబడి ఉండాలనీ, గ్రామదేవతకు కోపం రానీయవద్దని చాటింపు వేశారు. ఈ రాత్రి మనదే వంతు ! వంద రూపాయలు, గొర్రెపోతూ, కల్లుకుండ ఏర్పాటు చేయడానికే మీ బావగారు ఊళ్ళోకి వెళ్ళారు."

"సరే నేనొచ్చాను కదా నీకేం భయంలేదు. ఈ ఊరికేం భయం లేదు. ఈ రాత్రికే ఆ విషయం తేల్చేస్తాను." అంటూ శేఖర్ స్నానానికి లేచాడు.

"అక్కా టీ, కాఫీలేమొద్దు పెందరాళే అన్నం పెట్టు. ప్రయాణంలో అలసి పోయాను. తొందరగా పడుకోవాలి. తొందరగా లేవాలి కూడా" అని పెద్దగా నవ్వుకుంటూ స్నానానికై నూతిపళ్ళెం వైపు దారి తీశాడు శేఖర్.

అర్థరాత్రయ్యింది. చీకటి నిశ్శబ్దాన్ని చీలుస్తూ కీచురాళ్ళు రొదచేస్తున్నాయి."బావగారూ ! టార్చ్‌లైట్ పట్టుకురండీ" శేఖర్ కేకేశాడు. ఆ కేక వినపడగానే చావడిలో పడుకున్న నలుగురు దుడ్డుకర్రలతో వచ్చారు. శేఖర్ వాళ్ళ బావగారు టార్చ్‌వేస్తూ బయటికి పరిగెత్తుకొచ్చారు.

"వీడేనండి ! అమ్మవారి పేరుతో డబ్బూ, గొర్రెపోతులూ స్వాహా చేస్తున్నవాడు. చూడండి మీలో ఎవరైనా గుర్తు పడతారేమో" అన్నాడు శేఖర్. చీకట్లో శేఖర్ చేతికి చిక్కిన వాడు శేఖర్‌ని నెట్టేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని నలుగురు నాలుగువైపుల నుండి దుడ్డు కర్రలతో బాది కూచోబెట్టారు. అనసూయమ్మ ఆందోళనగా లాంతరు తీసుకుని వచ్చింది. "తమ్ముడూ ! ఏమైందిరా ? బావగారిని కేకేశావెందుకూ" అని అడిగింది.

"నువ్వేం కంగారు పడకక్కా ? అంతా నా ప్లాన్ ప్రకారమే జరిగింది. బావగారిని, నలుగురు మనుషుల్ని రాత్రే సిద్ధం చేశాను. ఇదిగో వీధి గుమ్మాలమీద అంకెలు రాసి పోయేవాడు, వీడే ! వీడి రాతలకే ఊరంతా హడలి ఛస్తోంది ! అమ్మవారు లేదూ, గ్రామ దేవతా లేదు. ఉన్నదల్లా ఈ మోసగాడే !" అన్నాడు శేఖర్.

"వీడా ? మీసాల పోతుగాడు. మన పక్క ఊర్లో ఉంటాడు. తలుపు తెరచి చూస్తే రక్తం కక్కుకుని చచ్చిపోతారని భయ పెట్టాడు. తన్నుండి వెధవను" అన్నారు ఎవరో. "తమ్ముడూ ! నీకేం కాలేదుకదా ?" అంటూ అనసూయమ్మ తమ్ముడి ముఖం లాంతరు వెలుగులో చూసుకుంది.

" నాకేమవుతుందక్కా... ? బావగారూ, నలుగురు మనుషులూ నాకు తోడుగా వున్నారుగా ? ఊళ్ళో వాళ్ళ పిరికి తనాన్ని, భయాన్ని, వీడు బాగా ఉపయోగించుకుంటున్నాడు. ఈ రోజుతో వీడి ఆటకట్టు".

"భలే పని చేశావు శేఖర్. ధైర్యవంతుడివే... కొంచెం తెగింపు, ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి మూఢ నమ్మకాలనైనా పటా పంచలు చెయ్యొచ్చు. ఆ మీసాల పోతుగాణ్ణి చావడికి కట్టేయండి రేపొద్దున చూద్దాం. వాడి సంగతి" అన్నాడు శేఖర్ వాళ్ళ బావగారు

"హమ్మయ్య నా తమ్ముడి వల్ల ఈ ఊరికి ఒక మంచి జరిగింది" -అంటూ సంతోషం పట్టలేకపోయింది అనసూయమ్మ.



నాటి తలలు గొట్టే పల్లె నేటి కలుగొట్లపల్లె

దోసీపాల్



ఆనాటి తలలుగొట్టే బూరుజుచెట్టు)

"ఊరికో చరిత్ర వీధికో కథ" అని మన పెద్దవాళ్లు ఊరికే అనలేదు మరి!

కొన్ని కొన్ని ఊళ్లకు పేర్లు ఆయా వంశజులను బట్టి వస్తుంది. కొన్ని ఊళ్లకు ఆయా ఊర్ల చారిత్రకనేపథ్యం ఉట్టిపడేలా ఏర్పడతాయి. మరికొన్ని ఆ ఊరిలో జరిగిన విపరీతాన్ని బట్టి కూడా పేరు ఏర్పడుతుంది. అందుకు ఈ కలుగొట్ల పల్లె ఉదాహరణ అనవచ్చు. ఊరిప్రజల పలుకుబడిలో కలుగొట్ల పల్లె అయినా అందుకు పూర్వం మాత్రం దాన్ని తలగొట్లపల్లె అనేవారుట. దానికో కథనం కూడా ఉంది.

కలుగొట్లపల్లె స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్‌వారి పాలనా కేంద్రంగా ఉండేది. ఏడు గ్రామాలు ఏలుబడిలో ఉండేవి. అక్కడ ఒక తహసిల్దార్ ఉండేవారు. చుట్టుపక్కల పల్లెలవారు భూమి శిస్తు ఇక్కడికొచ్చే చెల్లించేవారు. ఆనాటి బ్రిటీషుపాలకులు స్థానిక పాలెగాళ్లను, లేదా తహసిల్దార్ లాంటి ఉద్యోగులనేర్పాటు చేసుకుని వారి ద్వారా ఆ ప్రాంత పన్నుల వసూలు కార్యక్రమం సాగించేవాళ్లు. ఆ గ్రామ పరిధిలోని కుగ్రామాలకు చెందిన వ్యక్తులు ఏ తప్పు చేసినా ఈ గ్రామ నడిబొడ్డులోని బురుజు దగ్గర దోషి తల నరికేవారని పాత తరంవారు ఇప్పటికీ చెబుతుంటారు.

ప్రస్తుత రెవెన్యూ విభజన ప్రకారం మండల కేంద్రమైన చాగలమర్రికి మూడు కి.మీ దూరంలో ఉండే నేటి కలుగొట్లపల్లి వంద సంవత్సరాల కిందట "తలలుగొట్టే పల్లి"గా పేరుగాంచినట్లు పెద్దల కథనం. ఈ గ్రామంలో ప్రతాప రుద్రమ రాజునాటి శిలా ఫలకాలు, బురుజు ఈ నాటికీ చెక్కు చెదరలేదు. ఈ చారిత్రక శిలాఫలకాల ఆధారంగా ఈ గ్రామానికి కాకతీయుల చరిత్ర ఉందనేది అర్థమవుతోంది. శిరశ్ఛేదనంలాంటి నిరంకుశపాలన, ఫ్యూడల్ పరిపాలన ఉన్నట్లు కూడా అర్థమవుతోంది.

నాడు ఆ గ్రామంలో 110 కుటుంబాలుండేవి. అధిక జనాభా ఉన్నా ఐక్యత చెదిరేది కాదు. నేటి పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. నీటి వనరులు లేవు. వర్షాధారమే దిక్కు కొద్దిమేర బోర్లున్నా వర్షా కాలంలో మాత్రమే అవి పనిచేస్తాయి. ఈ ఏడాది మండలంలో వర్షం కురవలేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు ఒట్టిపోయే పరిస్థితి నెలకొంది. కె.సి.కెనాల్ నుండి కాలువలు తవ్వి నీరు ఇస్తే సుమారు 1000 హెక్టార్ల భూమిలో ఆరుతడి పంటలు వేసేందుకు అవకాశం ఉంది. బనవాసికి బ్రిడ్జి నిర్మిస్తే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులుండవు. ఇలా జలవనరులు అభివృద్ధిచేస్తే పంటలు పండి గ్రామప్రజల ఆర్థిక స్థితిగతుల్లో గణనీయమైన మార్పులొస్తాయి. అలాంటి మార్పులు, అభివృద్ధి చోటుచేసుకుంటే సహజంగానే గ్రామ ముఖచిత్రమే మారిపోతుంది. ✪

టర్కీని భయపెడుతున్న హిట్లర్ భూతం

అవీ... ఇవీ

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు వెలువడిన రచనలలో నరహంతకుడు హిట్లర్ ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' పుస్తక ప్రచురణకు టర్కీ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఇటీవలి కాలంలో ఆ పుస్తకానికి విపరీత డిమాండ్ ఏర్పడటం ప్రభుత్వానికి ఆందోళన కలిగించింది. అమెరికన్లు ఇరాక్‌పై దురాక్రమణ జరిపిన తరువాత హిట్లర్ పుస్తకం చదివిన యువతరం హిట్లర్ రెచ్చగొట్టిన యూదు వ్యతిరేకత స్థానంలో అమెరికా వ్యతిరేకతను పెంచుకుంటారని ప్రభుత్వం భయపడుతోందట.

-ఎంకెఆర్



జలగలు

ఈ జనారణ్యంలో
మర్రి చెట్టు నీడలా దొరికిన
ఆ చౌరస్తా దగ్గర కొన్ని జలగలు !
మనుషుల రక్త మాంసాలని
పీల్చి బతుకుతవి...!!
అవి... ఎప్పుడూ కష్టించవు...
ఎదుటి మనిషి
కష్టాన్ని దోచుకుంటవి !
అవి... ఎన్నడూ చెమట చిందించవు
సునాయసంగా ఇతరుల
చెమటని ఖరీదు చేస్తాయి !!
అవి... తర తరాలుగా
తాత ముత్తాతల నుండి పేదవాడి
అవసరాన్ని 'క్యాష్' చేసుకోవడమెలాగో
వారసత్వంగా నేర్చుకున్నాయి !
అవి... అంతస్థులకు అంతస్థులుగా
ఆకాశహర్మ్యాలను నిర్మిస్తాయి !
కాళ్ళకు మట్టి అంటకుండా
కార్లల్లో షికార్లు చేస్తాయి !
అవి మంది సొమ్మును తిని బలసినవి
అందుకే... అవి పరాన్న జీవులైనవి !

- మరికంటి

(నవంబర్ 6 "బిల్డర్స్ -డే" అన్నారు. ఈ జలగల రోజు కాకూడదు. నిజమైన నిర్మాతలు కూలీలే)

కాలాన్ని
వెనక్కి పోనీయకు
ఆగి పోనీయకు
మోడువారినా...
చిగురిస్తూనే
ఉంటుంది.



విపరీత మోతాదులో రసాయినిక మందులు, ఎరువులతో పండిన ఆహారం తినడంద్వారా ఆ రసాయినాలు మానవుల శరీరంలోకి ప్రవేశించి మరిన్ని ప్రమాదాలకు దారితీస్తోంది. దీనితో రసాయినిక పదార్థాల, ఎరువుల వాడకాన్ని తగ్గించుకునే ప్రయత్నం పరిశోధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

విజ్ఞాన వీచిక

ఉదయశంకర్

ఆ వాసన వచ్చిందంటే...

పరాన్నజీవి పని ఫట్!

మొదట్లో ఆదిమ మానవులు తమకు ఆకలివేసినప్పుడు మాత్రమే తినాలినిపించేది. తినేందుకు ఏం దొరుకుతుందాని వెతుక్కునేవారు. కనబడిందాన్ని అందుకుని తినేవే కాకుండా కొంచెం కష్టపడి సంపాదించే ఆహారాన్ని వెంటాడి పట్టుకునేవారు. ఆనాటినుంచి వేటాడటం అనే దశలోకి వెళ్లారు. ఆహారాన్వేషణ, ఆహారవేట విధానంలో అనేక ప్రాంతాలకు వెళ్లాల్సిరావడం మూలంగా సంచార జీవులయ్యారు. అలాకాక తమకు కావాల్సిన ఆహారాన్ని కదలకుండా స్థిరనివాసులై పండించుకోవడం నేర్చుకున్నారు. అదే వ్యవసాయంగా రూపుదిద్దుకుంది. ఆనాటినుంచి పంటలు వేసుకుని తన తిండిని పండించుకోవడం నేర్చుకున్నారు. తమ తిండి తమకు దక్కకుండా వేరే జీవులకు భోజనమయిపోవడం మొదట్లో మానవులకేం ఇబ్బంది కలగలేదు. అందుకే మానవులు తాము తింటూ తమతో పాటుగా బతికే అన్ని రకాల జీవులనూ బ్రతకనిచ్చారు. ఒక్కమాటలో అప్పటి జీవవైవిధ్యానికేం ఆటంకం జరగనివ్వలేదు. తానుగా జీవవైవిధ్యాన్ని అడ్డుకునే, నాశనం చేసే ఏ చర్య చేపట్టలేదు.

అనేక సామాజిక పరిణామాలనంతరం అనూహ్యంగా పెరిగిపోయిన జనాభా తమ ఆహారంపై దాడిచేసి తమకు చాలకుండా చేస్తున్న క్రిమికీటకాలమీద, కంటికి కనిపించని సూక్ష్మజీవుల మీద యుద్ధం చేయాల్సివచ్చింది. అందుకు రకరకాల పద్ధతులు, మందులు కనిపెట్టారు. క్రిమి నాశక రసాయిన మందులు అనేకం ఉపయోగించారు. అవి జరగాల్సినవే కాక వాటితో పాటు జరగకూడని వాటిని కూడా సంభవింపజేశాయి. వాటి మూలంగా ఎరువులు, క్రిమినాశన రసాయినిక పెస్టిసైడ్స్ ఉపయోగించడం వల్ల పరిణామాలతో పాటు విపరిణామాలు కూడా జరిగాయి. వీటి వినియోగం మూలంగా జీవవైవిధ్యమేర్పడింది. ఎరువులు, మందులు హద్దుమీరి ఉపయోగించడం మూలంగా మానవుల జీవితంపై అనూహ్యమైన విపరిణామాలు కలుగజేసింది. పర్యావరణ, ఆరోగ్యపర, చివరికి మానవజన్యుపర ప్రమాదాలనుకూడా కలుగజేసే పరిస్థితి ఏర్పడింది. విపరీత మోతాదులో రసాయినిక మందులు, ఎరువులతో పండిన ఆహారం తినడంద్వారా ఆ రసాయినాలు మానవుల శరీరంలోకి ప్రవేశించి మరిన్ని ప్రమాదాలకు దారితీస్తోంది. దీనితో రసాయినిక పదార్థాల, ఎరువుల వాడకాన్ని తగ్గించుకునే ప్రయత్నం పరిశోధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి.



లాబ్‌లో పుట్టిన సువాసన మొక్క

డచ్, ఇజ్రాయిల్ దేశాలకు చెందిన ఒక శాస్త్రవేత్తల బృందం తమ జెనిటికల్ ఇంజనీరింగ్ విధానంతో ఒక మొక్కను తయారుజేశారు. అది ఒక విధమైన సుగంధాన్ని వెదజల్లుతుంది. ఆ సువాసన ద్వారా క్రిమికీటకాల నుంచి, పరాన్నజీవులైన ఫంగస్‌ల నుంచి, బాక్టిరియా లాంటి సూక్ష్మజీవుల బారినుండి పంటల్ని రక్షించే రక్షక కీటకాలను "బాడీగార్డులు"గా ఆకర్షిస్తుంది. ఇలాంటి వాసనల మొక్కల్ని విరివిగా వాడి పెస్టిసైడుల వాడకాన్ని తగ్గించవచ్చంటున్నారు ఈ శాస్త్రవేత్తల బృందం. ఇలాంటి చెట్లు కొన్ని రకాల వాసనలు వెదజల్లగానే ఆ సువాసనకు ఆకర్షితులై వచ్చిన రక్షక కీటకాలు ఆయా మొక్కలమీద దాడిచేయబోతున్న పరాన్నజీవులను చంపి తినేస్తాయి.

డచ్, ఇజ్రాయిలీ దేశాల పరిశోధకబృందం స్ట్రాబెర్రీ జీవాణువు(జీన్)ను "ఆర్బిడోప్సిస్ థాలియానా" అనే కలుపుమొక్క మీద ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. దానితో ఆ కలుపుమొక్కలు బుద్ధిమంతులుగా మారిపోతాయి. వాటినుంచి 'టార్పినోయిడ్స్' అనే తియ్యతియ్యటి సువాసనలుత్పన్నమయ్యే రసాయినాన్ని విడుదలయ్యేటట్లు ఆ కలుపుమొక్కమీద కొలువై ఉన్న "స్ట్రాబెర్రీ జీన్" ప్రేరేపిస్తుంది. ఈ సుగంధభరితరసాయినాలు "ఫైటోసెయిలస్ పెర్సిమిలిస్" అనే క్రిమికీటకాదులను, కొన్ని రకాల జంతువులను భక్షించే మాంసాహార సాలెపురుగును ఆకర్షించి మొక్కకు కాపలాసైనికుల్లా డ్యూటీ చేయిస్తుంది. ఓ సాధారణ కలుపుమొక్కలా అమాయకంగా కనిపిస్తూనే ఈ అరాబిడోప్సిస్, ట్రాన్సిజెనిక్ ప్లాంట్‌గా సువాసనలు వెదజల్లి అనేక భక్షక సాలీడులను రక్షక సాలీడులా పనిచేయించేందుకు ఆకర్షిస్తుంది.

పరాన్నజీవిగుణ సూక్ష్మజీవులనేకం దోస, పత్తి, స్ట్రాబెర్రీ, యాపిల్, గులాబీలాంటి దాదాపు మూడొందల రకాల జాతులకు చెందిన మొక్కలను తరతరాలుగా పట్టిపీడిస్తున్నాయి. ఆ మొక్క కణజాలమంతటినీ పీల్చివేయడం, ఒక్కోసారి ఆ మొక్క చనిపోయేంతగా దాపురించాయని నెదర్లాండ్స్‌కు చెందిన "మార్సెల్ డిక్కే ఆఫ్ ది వాగెనింజెన్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్ సెంటర్" తమ పరిశోధనల్లో వెల్లడించింది.

ఈ పరిశోధనలు ఇంకా ముందుకు సాగి రైతులందరి అందుబాటులోకి వస్తే...ఎన్నో రసాయినిక కీటకనాశనులను, ఎరువులను వాడే బాధనుంచి బయటపడొచ్చు. పర్యావరణాన్ని, జీవావరణాన్ని రక్షించవచ్చు.

కొత్త పుస్తకాలు

ప్రాథమిక విద్యలో మెళకువలు

కఠినశిక్షల మధ్య యాంత్రికంగా సాగుతూ ఏ మాత్రమూ అభ్యసనావికాసాలకు దోహదపడని ప్రాథమిక విద్యను తన ప్రయోగాలతో సరికొత్త మార్గంలోకి తీసుకెళ్లిన మహనీయుడు గిజుబాయి బగేకా. విద్యకు సంబంధించిన సిద్ధాంతాలను పట్టుకుని ఆయన వేలాడలేదు. బోధనావిషయంలో పరిశీలనకు, ప్రయోగాలకు ప్రాధాన్యతనిచ్చారు. విద్యారంగంలో స్థానిక పరిస్థితులకనుగుణంగా చేయాల్సిన మార్పులను సూచించారు. గిజుభాయి ప్రతిపాదించిన విద్యాసంబంధమైన సిద్ధాంతాలు స్వాతంత్ర్యం, స్వావలంబన, స్వీయ క్రమశిక్షణ, సృజనాత్మకత మొదలగు వాటిపై ఆధారపడ్డాయి. ఉపాధ్యాయులు కేంద్రంగా ఉన్న బోధనాపద్ధతికి బదులుగా ప్రేమ, వాత్సల్యాలతో నిండిన బోధన చేయాలని ఆయన కోరిక.

గిజుభాయి 1
సమగ్ర సాహిత్యం
వె ల : 30-/ పేజీలు : 116
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్ హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి,
హైదరాబాద్, అన్ని
బ్రాంచీలలో దొరుకును.

తన రచనల్లో కొత్తదనం కోసం గిజుభాయి సంభాషణా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఆయన రచించిన "పగటికల"లో విద్యా సంబంధమైన ఎన్నో సలహాలు, సూచనలు ఉన్నాయి. బోధనను సరళంగా, సంతోషదాయకంగా తీర్చిదిద్దే అనేక చిహ్నాలనిందులో ఆకర్షణీయంగా చెప్పారు. యాంత్రికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకివన్నీ పగటికలల్లానే కనిపిస్తాయి. దేశంలోని ఉపాధ్యాయులందరూ ఈ నూతన పద్ధతులనాచరించినప్పుడే ఇవి నెరవేరతాయి. గిజుభాయి బాలల శిక్షణలో సంగీతం, ఇంద్రియాల శిక్షణ, శాంతిక్రీడ, జీవన వ్యవహారాలు, భాష, గణిత శిక్షణ, ప్రకృతి పరిచయం, కథాకథనం, చిత్రలేఖనం మొదలైనవి ముఖ్యాంశాలుగా ఉంటాయి.

బాలల వికాసంలో తల్లులు ఇరుసు వంటి వారని గిజుభాయి అభిప్రాయం. తెలివైన తల్లులు పిల్లల పెంపకంలోనూ, వారి విద్యాబుద్ధుల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటారు. ఇంటిలోని వస్తువులు బాలలకు అనుకూలంగా ఎలా ఉండాలి? బాలలు వేటిని అమితంగా ఇష్టపడతారు? వారు ఎలాంటి ఆటలాడుకుంటారు? వారికెలాంటి దుస్తులు ధరింపజేయాలి? ప్రతికూల పరిస్థితుల నుంచి ఎలా మనం వారిని కాపాడుకోవాలి? అనే విషయాలతో పాటు తల్లులు ఎలాంటి పరిస్థితిలోనూ తమ పిల్లలను కొట్టరాదని ఈయన ఉద్బోధించారు.

పిల్లల తల్లిదండ్రులు గిజుభాయిని ఎన్నో ప్రశ్నలేశారు. వారి ప్రశ్నలకు, అనుమానాలకు రాతపూర్వకంగానూ, సంభాషణల ద్వారానూ జవాబులిచ్చారు. ఈ జవాబుల సంగ్రహమే "తల్లిదండ్రుల ప్రశ్నలు"అనే ఈ పుస్తకం. ఇందులో గిజుభాయి అనుభవాలు, ప్రయోగాలు, ఆలోచనలు సారాంశరూపంలో ఉన్నాయి. తల్లిదండ్రులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ పుస్తకం చదివితే బాలల మనస్తత్వాన్ని బాగా అర్థం చేసుకోగలరు. ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు మొట్టమొదటిసారిగా గిజుభాయి సమగ్ర సాహిత్యాన్ని ఏడు సంపుటాలుగా వెలువరుస్తున్నారు. వీటిలోని మూడు పుస్తకాల సంపుటమే ఈ గిజుభాయి సమగ్రసాహిత్యంలో మొదటి భాగంగా వచ్చింది.

- కుమార్

బాలసాహిత్యం
బాలల బొమ్మలు కథలు
వాసాల వంశీధర్
వెల : 25/-, పేజీలు : 68
ప్రతులకు : వాసాల నరసయ్య,
నవోదయ బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, సాహిత్యనికేతన్, విశాలాంధ్ర బుక్ హౌస్ లలో దొరుకును

స్పందన
వెల 30/-, పేజీలు : 66
ప్రతులకు :
ఇ.వి. శర్మ
ఇ.నెం.1-3-87,
రాజేంద్రనగర్
మహబూబ్‌నగర్ - 509 001.

శుక్రుడు - అంతర్యానాలు

శుక్రుడు సౌరకుటుంబంలో అతి ప్రకాశవంతమైన గ్రహం. ఈ గ్రహం గురించి అనేక రహస్యాలను ఆధునికవిజ్ఞానం వెల్లడించింది. శుక్రుడు సూర్యోదయానికి ముందు ఆరుమాసాలు ఉదయతారగానూ, సూర్యాస్తమయం తర్వాత ఆరుమాసాలు సంధ్యాతారగానూ వెలుగుతాడు. తూర్పు నుంచి పడమరవైపు ప్రయాణిస్తాడు. అందుకే శుక్రుని నుంచి చూస్తే సూర్యుడు పశ్చిమాన ఉదయిస్తున్నట్లు, తూర్పున అస్తమిస్తున్నట్లు కనిపిస్తాడు. శుక్రుడు సూర్యగ్రహం మీదుగా ఒక చిన్నచుక్కలా ప్రయాణిస్తాడు. దీన్నే అంతర్యానం అంటారు. ఇది నూరేళ్లకు పైగా సంభవించే ఖగోళ సంఘటన. తాజాగా ఈ శతాబ్దపు శుక్ర అంతర్యానం 2004 జూన్‌లో సంభవించింది. మరల 2012 జూన్‌లో కనిపిస్తుంది. ఈ శుక్ర అంతర్యానం, శుక్ర గ్రహ విశేషాల గురించి ఈ చిన్న పుస్తకం తెలియజేస్తుంది.



శుక్రుడు- అంతర్యానాలు
అనువాదం :
పురాణపండ రంగనాథ్
వెల 25/- పేజీలు : 39
ప్రతులకు :
అలకనంద ప్రచురణలు
మేరిస్ స్టెల్లా కాలేజ ఎదురుగా,
విజయవాడ-520 008

"శుక్రుడు - అంతర్యానాలు" అను: పురాణ పండ రంగనాథ్, అలకనంద ప్రచురణలు, విజయవాడ-8, వెల 25/-, పేజీ 40, ప్రతులకు : అశోక్ బుక్ సెంటర్ విశాఖపట్నం, అక్షర హైదరాబాద్

- కె.పి. అశోక్‌కుమార్

క్యారెట్ మసాలా కూర

కావలసిన వస్తువులు

క్యారెట్	:	నాలుగు
ఉల్లిపాయలు	:	రెండు
పచ్చి మిర్చి	:	ఆరు
అల్లం	:	చిన్న ముక్క
పచ్చి కొబ్బరి	:	చిన్న ముక్క
ధనియాలు	:	ఒక చెంచా
గసగసాలు	:	ఒక చెంచా
వెల్లుల్లి	:	రెండు రెబ్బలు
కరివేపాకు	:	రెండు రెమ్మలు
కొత్తిమీర	:	ఒక కట్ట
పసుపు	:	చిటికెడు
ఉప్పు	:	తగినంత
గరంమసాలా	:	ఒక స్పూన్
నూనె	:	మూడు చెంచాలు

తయారుచేసే విధానం

క్యారెట్ చెక్కు తీసి కడిగి సన్నని ముక్కలుగా తరగాలి. ఉల్లిపాయలు కూడా ముక్కలు కోసుకోవాలి. కొబ్బరి, పచ్చిమిర్చి, అల్లం, ధనియాలు, గసగసాలు, వెల్లుల్లి, గరం మసాలా అన్నీ కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఒక గిన్నె పొయ్యి మీద పెట్టి నూనెపోసి కాగిన తరువాత ఉల్లిపాయ ముక్కలు, పసుపు, కరివేపాకు, క్యారెట్ ముక్కలు, ఉప్పు వేసి కొద్దిగా వేగనివ్వాలి. తరువాత రుబ్బిన గరం మసాలా ముద్దను ఉడికే కూరలోవేసి కమ్మని వాసన వచ్చేదాకా ఉడకనిచ్చి దించాలి.

రుచి

దొండకాయ గుత్తికూర



కావలసిన వస్తువులు

దొండకాయలు	:	పావు కిలో
నూనె	:	ఆరు చెంచాలు
కారం	:	ఒక చెంచా
ఉల్లిపాయలు	:	నాలుగు
ఉప్పు	:	తగినంత
జీలకర్ర	:	రెండు చెంచాలు

తయారుచేసే విధానం

దొండకాయలను లేతవీ, తాజావీ తీసుకొని కడుక్కోవాలి. కాయలు విడిపోకుండా నాలుగు పక్షాలుగా కోయాలి. నాలుగు చెంచాల నూనె వేసి కాయలను మగ్గబెట్టాలి. కారం, ఉల్లిపాయలు, జీలకర్ర వేసి నూరాలి. వేగిన కాయలు చల్లారిన తరువాత కాయలు విడిపోకుండా ఈ నూరిన కారాన్ని కాయల లోపల పెట్టాలి. మిగిలిన రెండు చెంచాల నూనె వేసి ఈ కాయలను వేసి కాసేపు వేయించాలి. దొండకాయ గుత్తి కూరలో ఉల్లికారమే కాకుండా శనగపిండిలో కారం, ఉప్పు, జీలకర్ర వేసి నూరి కాయలలో పెట్టి వేయించినా కూడా చాలా రుచిగా ఉంటుంది.



కలంస్నేహం

కాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్టుకార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పేరు : మస్నూరా
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు : ఎపిఎస్‌డబ్ల్యు గురుకుల పాఠశాల
హాబీలు : ఆటలు ఆడడం, టీవీ చూడడం, చదువుకోవడం.
చిరునామా : మస్నూరా, డాటరాఫ్ మొల్లబాబు, ఇం.నెం: 3-33, లంకాల్, నర్వ, మహబూబ్‌నగర్.

పేరు : తాటికొండ గోపి
వయసు : 8 సం॥
చదువు : 4వ తరగతి
స్కూలు : ఎం.పి.పి.స్కూలు
హాబీలు : ప్రజాశక్తి పేపర్ చదవడం, టీవీ చూడడం, క్రికెట్ ఆడడం
చిరునామా : తాటికొండ గోపి, సన్నాఫ్ టి. కొండలు, దగ్గులవారి బజారు, త్రిపురాంతకం, ప్రకాశం.

పేరు : జె.రాధబాబు
వయసు : 12 సం॥
చదువు : 8వ తరగతి
స్కూలు : యు.పి.ఎస్. స్కూల్
లక్ష్యం : సైంటిస్టు కావడం
హాబీలు : క్రికెట్ ఆడడం, ప్రజాశక్తి అనుబంధం చదవడం
చిరునామా : జె.రాధబాబు, సన్నాఫ్ నాగులు, తూటికుంట్ల, బోనకల్, ఖమ్మం.

పేరు : ఖాజాబీ
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు : గురుకుల పాఠశాల
హాబీలు : కథల పుస్తకాలు చదవడం, ఆడుకోవడం, టీవీ చూడడం.
చిరునామా : ఖాజాబీ, డాటరాఫ్ బాబుమియా, లంకాల్, నర్వ, మహబూబ్‌నగర్.

పేరు : డి.శ్రీకాంత్
చదువు : 7వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, టీవీ చూడడం
స్కూలు : పానసీయ మహా విద్యాలయం హైస్కూల్
లక్ష్యం : కలెక్టర్ కావడం
చిరునామా : డి.శ్రీకాంత్, సన్నాఫ్ డి.సంజీవకుమార్, విజయపురి కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్.

పేరు : కొండవీటి ప్రసన్న కుమార్
వయసు : 13 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, చెస్ ఆడడం, డ్రాయింగ్ వేయడం, అందరితో స్నేహంగా వుండడం.
చిరునామా : కొండవీటి ప్రసన్న కుమార్, సన్నాఫ్ కె.బుజ్జిబాబు, ముక్కపేట కాలనీ, నందిగామ -521185.

పేరు : కె. సాహిల్
వయసు : 8 సం॥
చదువు : 3వ తరగతి
హాబీలు : కార్టూన్ చానల్ చూడడం, కరాటే చేయడం, బొమ్మలేయడం
చిరునామా : కె. సాహిల్, 3వ తరగతి, అభ్యుదయ హైస్కూల్, అశోక్ నగర్, హైదరాబాద్.